

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 13-05-2026 | సంపుటి - 27 | సంచిక -351 | రూ : 4 | పేజీలు: 8

## జిల్లాకో సమస్య...
# వాటిపై ఎలుగెత్తుదాం!



- ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై రానున్న రెండేళ్లూ పోరాడాలి
- డిజిటల్ పద్ధతిలో పార్టీ సభ్యత్వ నమోదు
- ముఖ్య నేతలకు భారాస అధినేత కేసీఆర్ దిశానిర్దేశం
- ఎర్రవల్లిలో ఆరు గంటలపాటు కొనసాగిన సమావేశం

సిద్దిపేట: ''రాష్ట్రంలో ప్రస్తుతం జిల్లాకో సమస్య నెలకొని ఉంది. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాల వారీగా ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఎలుగెత్తాలి. ఈ మేరకు ప్రణాళికలు సిద్ధం చేసుకుని ఉద్యమించాలి'' అని భారాస అధినేత కేసీఆర్ తమ పార్టీ ముఖ్య నేతలకు ఆదేశించారు. తరువాయి 2లో



# ధాన్యం సేకరణ వేగంగా పూర్తిచేయాలి

- నిర్లక్ష్యంగా ఉంటే కలెక్టర్లపైనా చర్యలు
- గోడౌన్ల సమస్య ఉన్నచోట తాత్కాలిక ఏర్పాట్లు చేయండి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: రాష్ట్రంలో ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లలో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించేది లేదని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. సమస్య తీవ్రతకు అనుగుణంగా చర్యలు తీసుకోకపోతే కలెక్టర్లపైనా చర్యలకు ప్రభుత్వం వెనకాడదని హెచ్చరించారు. కొనుగోళ్ల ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని యంత్రాంగాన్ని ఆదేశించారు. రాష్ట్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియ, పురోగతిపై మంగళవారం కలెక్టర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో తలెత్తిన ఇబ్బందులు, సమస్యలపై కలెక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తరువాయి 2లో




# నీట్ పరీక్ష రద్దు

- రాజస్తాన్‌లో ప్రశ్నాపత్రం లీక్ కేసు నమోదు చేసిన సీబీఐ
- మహారాష్ట్రలో ఒకరి అరెస్ట్
- ఈనెల 3న దేశవ్యాప్తంగా జరిగిన పరీక్ష
- 22 లక్షల మంది విద్యార్థులకు నిరాశ
- నిరుత్సాహంలో తల్లిదండ్రులు
- మోదీ సర్కార్ వైఫల్యాలకు నిదర్శనం
- మళ్లీ పరీక్ష నిర్వహిస్తాం..: ఎన్‌టీఏ డీజీ అభిషేక్‌సింగ్

2లో

## నా కుమారుడు తప్పు చేస్తే
# శిక్ష పడాల్సిందే..!

- నా కుటుంబంపై కుట్రలు చేసినవాళ్లను వదిలిపెట్టను
- హిందూ ఏక్తాయాత్రలో బండి సంజయ్ వ్యాఖ్యలు



కరీంనగర్: 'నిజంగా నా కుమారుడు తప్పు చేస్తే వందశాతం శిక్ష పడాల్సిందే.. చట్టం ముందు అందరూ సమానమే' అని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. కరీంనగర్‌లో మంగళవారం నిర్వహించిన హిందూ ఏక్తా యాత్రలో ఆయన మాట్లాడారు. ''సమాజమే నా కుటుంబమనుకుని రేయింబవళ్లు ప్రజల కోసం పాటుపడ్డా.. 150 రోజులు 1,600 కి.మీ. పాదయాత్ర చేసి అన్నివర్గాల ప్రజల కష్టనష్టాల్లో భాగమయ్యా. ప్రజలే నా కుటుంబమనుకున్నా. కానీ, నా కుటుంబానికి, నా కుమారుడికి సమయమివ్వకుండా పొరపాటు చేశా. తప్పు నాదే. ఎప్పుడూ మాట్లాడలేకపోయా. అందుకే సమాజానికి నేను క్షమాపణ చెబుతున్నా. సమాజం ముందు కుమారుడిని క్రిమినల్‌లా చూపిస్తే ఏ తండ్రికైనా బాధేస్తుంది. 'తప్పు తరువాయి 2లో




# తెలంగాణకు 22, ఏపీకి 10 టీఎంసీలు

- కృష్ణా జలాలు పంపిణీ చేయాలని కేఆర్ఎంబీ నిర్ణయం
- ఈ నెల 14న మరోసారి సమావేశం

2లో



# బంగారంపై సాగు రుణమా.. బాదేయ్

- పేరుకే వ్యవసాయ అవసరాలకు ఇచ్చే అప్పు
- ప్రాసెసింగ్, అప్రైజర్ ఛార్జీలంటూ ఇష్టమొచ్చినట్లు వసూలు
- వడ్డీ ఏడాదికి 9-10 శాతం వరకు
- రైతులను సతాయిస్తున్న ప్రభుత్వ రంగ బ్యాంకులు

2లో

# శ్రీవాణి టికెట్ల 'హైజాక్'

- సాఫ్ట్‌వేర్ గిమ్మిక్కులతో క్షణాల్లో బుకింగ్
- ఒక్కో టికెట్‌పై రూ.3 వేల వరకు దోపిడీ




తిరుపతి: శ్రీవారి భక్తుల భక్తిని కొందరు అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. 'శ్రీవాణి ట్రస్ట్'కు విరాళమిచ్చేవారికి కేటాయించే దర్శన టికెట్లు ఇప్పుడు ప్రైవేటు ట్రావెల్స్ సంస్థల చేతుల్లో బందీ అవుతున్నాయి. సాధారణ భక్తులు వెబ్‌సైట్‌లో వివరాలు నింపేలోపే.. హైటెక్ పరిజ్ఞానంతో ప్రైవేటు ఏజెంట్లు 'హైజాక్' చేస్తున్నారు. ఒక్కో టికెట్‌పై రూ.3,000 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. ఇటీవలే ఈ అక్రమ ఉదంతం వెలుగులోకి రావడంతో తితిదే విజిలెన్స్ విభాగం రంగంలోకి దిగింది.

తరువాయి 2లో



# రాష్ట్రమంతా 5జీ నెట్‌వర్క్!

- కొత్తగా 707 చోట్ల టవర్ల ఏర్పాటు
- ఏజెన్సీ ప్రాంతాలు.. అధిక రద్దీ నగరాలకు ప్రాధాన్యం
- కేంద్ర ప్రభుత్వ 'డిజిటల్ భారత్ నిధి' పథకం కింద ఏర్పాటు

2లో

# ధాన్యం సేకరణ వేగంగా పూర్తిచేయాలి

హైదరాబాద్: రాష్ట్రంలో ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లలో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించేది లేదని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. సమస్య తీవ్రతకు అనుగుణంగా చర్యలు తీసుకోకపోతే కలెక్టర్లపైనా చర్యలకు ప్రభుత్వం వెనకాడదని హెచ్చరించారు. కొనుగోళ్ల ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని యంత్రాంగాన్ని ఆదేశించారు. రాష్ట్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియ, పురోగతిపై మంగళవారం కలెక్టర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో తలెత్తిన ఇబ్బందులు, సమస్యలపై కలెక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని.. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోళ్ల తీరును పరిశీలించాలని సూచించారు.

**కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు**

చేసుకున్న ఒప్పందం మేరకు ధాన్యం తరలించేందుకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లను ఉపేక్షించవద్దని సీఎం స్పష్టం చేశారు. అవసరమైతే అలాంటి కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులకూ వెనకాడొద్దన్నారు. ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలు అందుబాటులో ఉండేలా చూడాలని రవాణాశాఖ కమిషనర్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు. సమస్య తీవ్రతను గుర్తించి కలెక్టర్లు సరైన చర్యలు తీసుకోవాలని, ప్రతి అధికారి జవాబుదారీతనంతో వ్యవహరించాల్సిందేనని స్పష్టం చేశారు. "ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోడౌన్లకు తరలించాలి. వివిధ ప్రాంతాల్లో గోడౌన్ల సమస్య ఉన్నట్లు తెలుస్తోంది. అలాంటి ప్రాంతాల్లో అవసరాన్నిబట్టి కలెక్టర్లు తాత్కాలిక ఏర్పాట్లు చేయాలి. రైతుబజార్లు, ఫంక్షన్ హాళ్లకు ధాన్యాన్ని తరలించాలి. వెసులుబాటును బట్టి అక్కడి నుంచి గోడౌన్లకు తరలించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. గన్నీ బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూసుకోండి.

**అకాలవర్షాల నష్టాన్ని తగ్గించాలి**

అకాల వర్షాలతో రైతులు నష్టపోకుండా ఉండేలా ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటుచేయాలి. శాశ్వత పరిష్కార దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలి. కల్లాల వద్ద ధాన్యం తడవకుండా టార్పాలిన్లను రైతులకు అందుబాటులో ఉంచాలి. మొక్కజొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల కలెక్టర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. అవసరమైన చోట పోలీస్ సహాయం తీసుకుని సేకరణ సాఫీగా జరిగేలా చూడాలి. ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్లపై కలెక్టర్లు ఎప్పటికప్పుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నివేదిక పంపించాలి. ప్రతి రైస్ మిల్లు దగ్గర ఒక బాధ్యతాయుతమైన అధికారిని నియమించి పర్యవేక్షించాలి. ధాన్యం లోడింగ్‌లో జాప్యం జరగకుండా స్థానిక హమాలీలతో పని చేయించుకోవాలి.

**ధాన్యం లోడ్ చేయగానే రసీదు ఇవ్వాలి**

లారీలోకి ధాన్యం లోడ్ చేయగానే రైతులకు రసీదు అందేలా చర్యలు తీసుకోవాలి. అలాచేస్తే తాలు, తరుగు పేరుతో అక్రమాలు జరగకుండా చూడొచ్చు. లారీల కొరతను అధిగమించేందుకు దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించేలా చర్యలు తీసుకోండి.

# రాష్ట్రమంతా 5జీ నెట్‌వర్క్!

అమరావతి: రాష్ట్రంలో మారుమూల ప్రాంతాలకు సైతం 5జీ నెట్‌వర్క్ అందుబాటులోకి రానుంది. దీనికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం దృష్టిపెట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 25 జిల్లాల్లో.. కొత్తగా 707 సెల్‌టవర్లను ఏర్పాటు చేయనుంది. 641 చోట్ల భూములను రాష్ట్రప్రభుత్వం అప్పగించింది. ఇప్పటికే రాష్ట్రంలో 1,668 సెల్‌టవర్లు ఉన్నాయి. కొత్తగా ఏర్పాటుచేసే వాటితో కలిసి వీటి సంఖ్య 2,375కు చేరనుంది. మరో 700 వరకు టవర్ల ఏర్పాటుకు ప్రతిపాదన పరిశీలనలో ఉంది. 'డిజిటల్ భారత్ నిధి' పథకం కింద కొత్త సెల్‌టవర్ల ఖర్చును కేంద్రం భరిస్తుంది. వాటికి స్థలాన్ని రాష్ట్రప్రభుత్వం సమకూరుస్తుంది. ఈ పథకం కింద బీఎస్ఎన్ఎల్, జియో, ఎయిర్‌టెల్ సంస్థలు టవర్లు ఏర్పాటు చేయనున్నాయి.

**ఏజెన్సీ జిల్లాలకు ప్రాధాన్యం**

> ప్రపంచం 5జీ నెట్‌వర్క్‌తో పరుగులు పెడుతుంటే.. ఏజెన్సీ వాసులు ఇప్పటికీ సిగ్నల్ అందక ఇబ్బంది పడుతున్నారు. మన్యం జిల్లాల్లో సిగ్నల్ సమస్య పరిష్కారానికి అధికసంఖ్యలో సెల్ టవర్లను ఏర్పాటుచేస్తున్నారు.

> అల్లూరి సీతారామరాజు జిల్లాలో 101, పార్వతీపురం మన్యం జిల్లాలో 78 కొత్త టవర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

> శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో 75, ఏలూరులో 45, తిరుపతిలో 54, శ్రీకాకుళంలో 43 టవర్ల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ ప్రాంతాల్లో ఉన్న టవర్ల సామర్థ్యం సరిపోక తరచూ సిగ్నల్ సమస్యలు వస్తున్నాయి. అందుకే ఈ నాలుగు జిల్లాల్లో 217 టవర్లు ఏర్పాటుచేస్తున్నారు.

*** రెవెన్యూ.. అటవీ శాఖల క్లియరెన్స్‌లో జాప్యం**

కొత్త టవర్ల ఏర్పాటుకు రెవెన్యూ శాఖకు చెందిన ఖాళీ స్థలాలతో పాటు, ఏజెన్సీ ప్రాంతాల్లోని అటవీ భూములూ అవసరం. కొన్నిచోట్ల టవర్ల నిర్మాణానికి అవసరమైన యంత్రాలు, సామగ్రిని తరలించడానికి రోడ్లూ లేవు. అయినా, నెట్‌వర్క్ అందుబాటులోకి తేవాలన్న లక్ష్యంతో ప్రభుత్వం అలాంటి ప్రాంతాలనూ గుర్తించింది. ఇలాంటి 66 చోట్ల స్థలాలను ఇంకా రెవెన్యూ, అటవీ శాఖలు అప్పగించాల్సి ఉంది. వారి క్లియరెన్స్‌లో జాప్యం వల్లే ఇవి ఆగాయి.

# నా కుమారుడు తప్పు చేస్తే శిక్ష పడాల్సిందే!

కరీంనగర్: 'నిజంగా నా కుమారుడు తప్పు చేస్తే వందశాతం శిక్ష పడాల్సిందే.. చట్టం ముందు అందరూ సమానమే' అని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. కరీంనగర్‌లో మంగళవారం నిర్వహించిన హిందూ ఏక్తా యాత్రలో ఆయన మాట్లాడారు. "సమాజమే నా కుటుంబమనుకుని రేయింబవళ్లు ప్రజల కోసం పాటుపడ్డా.. 150 రోజులు 1,600 కి.మీ. పాదయాత్ర చేసి అన్నివర్గాల ప్రజల కష్టనష్టాల్లో భాగమయ్యా. ప్రజలే నా కుటుంబమనుకున్నా. కానీ, నా కుటుంబానికి, నా కుమారుడికి సమయమివ్వకుండా పొరపాటు చేశా. తప్పు నాదే. ఎప్పుడూ మాట్లాడలేకపోయా. అందుకే సమాజానికి నేను క్షమాపణ చెబుతున్నా. సమాజం ముందు కుమారుడిని క్రిమినల్‌లా చూపిస్తే ఏ తండ్రికైనా బాధేస్తుంది. 'తప్పు చేయలేదు నాన్నా.. ఫ్రెండ్స్‌లాగా కలిసి ఉన్నాం. తరువాత విడిపోయాం.. నిజాయతీగా బయటికొస్తా' అని నా బిడ్డ నాతో చెప్పాడు. నేను అతడిని సమర్థించట్లేదు. తప్పు ఎవరు చేసినా తప్పే.. నా బిడ్డకు ఒక న్యాయం, ఇతరులకు ఇంకో న్యాయం అంటూ ఉండదు. అతడు నిజంగా తప్పు చేస్తే శిక్షను ఎదుర్కోవాల్సిందే. ఈ రోజు నా భార్య కూడా నా దారిలో నడుస్తున్నారు. బ్యాంకు ఉద్యోగానికి సెలవు పెట్టి ఇంట్లో ఉంటూ నన్ను నమ్మిన కార్యకర్తలకు సహాయం చేస్తున్నారు. ఇప్పుడు ఆ కన్నపేగు డిప్రెషన్‌లోకి పోతోంది.. విలపిస్తోంది. కుటుంబంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా దాడి చేస్తుంటే ఏ కన్నతల్లి మాత్రం భరించగలదో ఆలోచించండి. బండి సంజయ్ భయపడే వ్యక్తి కాదు. రాముడంతటి దేవుడికే కష్టమొచ్చింది. తరువాత ఆదర్శ రాముడిగా నిరూపించుకున్నాడు. నా జీవితంలో ఎన్నో కష్టాలు పడ్డాను. సామాన్య కార్యకర్తగా జెండాలు కట్టిన నేను ఈ రోజు ఈ స్థాయిలో నిలబడ్డాను. నా భుజం మీద కాషాయ జెండా.. నా శిరసుపై అమ్మవారి ఆశీస్సులున్నాయి. నన్ను ఈరోజు కొందరు లక్ష్యంగా చేసుకుంటున్నారు. వారికి చెబుతున్నా. మీరు పెట్టిన నిప్పుతోనే మీ భరతంపడతా. ఆంజనేయ స్వామి లంకను కాల్చినట్టు.. తెలంగాణలో దళారుల వ్యవస్థను, కుటుంబ పాలన వ్యవస్థను, అవినీతి వ్యవస్థను పక్కాగా దహనం చేస్తా. ఎవరైతే కుట్రలు, కుతంత్రాలు చేస్తూ.. నా కుటుంబాన్ని బజారుకీడ్చారో.. నా కార్యకర్తల్లో ఆవేదనను రగిల్చారో.. నా పార్టీని ఇబ్బందుల్లో పెట్టారో.. వారిలో ఏ ఒక్కరినీ నేను విడిచిపెట్టే ప్రసక్తి లేదు. భారాస హయాంలో 29 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారు.. వారి కుటుంబాల బాధలు నాకు తెలుసు. మళ్లీ వారి కుటుంబాలను కలుస్తా" అని అన్నారు.

# జిల్లాకో సమస్య... వాటిపై ఎలుగెత్తుదాం!

సిద్దిపేట: "రాష్ట్రంలో ప్రస్తుతం జిల్లాకో సమస్య నెలకొని ఉంది. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాల వారీగా ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఎలుగెత్తాలి. ఈ మేరకు ప్రణాళికలు సిద్ధం చేసుకుని ఉద్యమించాలి" అని భారాస అధినేత కేసీఆర్ తమ పార్టీ ముఖ్య నేతలకు ఆదేశించారు. పార్టీ సభ్యత్వ నమోదును డిజిటల్ పద్ధతిలో చేపట్టాలని నిర్ణయించారు. సభ్యత్వ నమోదు బాధ్యతలను ఉమ్మడి జిల్లాల వారీగా పార్టీ ప్రధాన కార్యదర్శులకు అప్పగించారు. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం పార్టీ ప్రధాన కార్యదర్శులు, ముఖ్యనేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. సుమారు ఆరు గంటలపాటు కొనసాగిన ఈ సమావేశంలో... ధాన్యం, శనగలు, మక్కల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను పలువురు నేతలు తమ అధినేత దృష్టికి తీసుకొచ్చారు. రాష్ట్ర రాజకీయ పరిణామాలపైనా చర్చించారు. అనంతరం కేసీఆర్ మాట్లాడుతూ... "రాష్ట్రంలో అన్నదాతలతోపాటు అన్నివర్గాల ప్రజలూ సమస్యలతో సతమతమవుతున్నారు. వారికి పార్టీ అండగా నిలవాలి. రానున్న రెండేళ్లపాటు ప్రజాక్షేత్రంలో ఉండేలా పోరాట పథాన్ని ఎంచుకోవాలి. సామాజిక మాధ్యమాలను విస్తృతంగా వినియోగించుకోవాలి. ఓటరు జాబితాల సమగ్ర సవరణ(సర్)పైనా ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి. జిల్లా కేంద్రాల్లో శిక్షణ.. సభ్యత్వ నమోదు కమిటీలు: సభ్యత్వాల నమోదుకు ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఇద్దరు కార్యకర్తలను ఎంపిక చేసి, వారికి జిల్లా కేంద్రాల్లో సాంకేతిక నిపుణులతో శిక్షణ ఇప్పించాలి. మండలాలు, పురపాలికలకు ఐదుగురు నేతలతో సమన్వయ కమిటీలను రెండు, మూడు రోజుల్లో వేయాలి. సభ్యత్వ నమోదును పర్యవేక్షించేందుకు రాష్ట్రకమిటీ నుంచి అసెంబ్లీ నియోజకవర్గానికో సమన్వయకర్తను నియమించాలి. పల్లెలు, పట్టణ కమిటీలో నాయకుల బంధువులకు స్థానం లేదు. పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తున్న నాయకులకే పట్టం కట్టాలి. సమావేశంలో మాట్లాడుతున్న కేసీఆర్. చిత్రంలో హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్, మధుసూదనాచారి, కేటీఆర్, జీవన్‌రెడ్డి, సబితారెడ్డి, కె.ఆర్. సురేశ్‌రెడ్డి బలంగా లేని నియోజకవర్గాలపై దృష్టి: రాష్ట్రంలోని కొన్ని నియోజకవర్గాల్లో పార్టీ బలహీనంగా ఉన్నట్లు కనిపిస్తోంది. వాటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి. అవసరమైతే ఆయా నియోజకవర్గాల్లో భారీ బహిరంగ సభలు నిర్వహించాలి. మండలం, జిల్లా, పురపాలికల స్థాయిల్లో కొత్త నేతలను తయారు చేయాలి. పార్టీలోకి బలమైన వర్గాలకు చెందిన ముఖ్యనేతలను ఆహ్వానించాలి. త్వరలో జిల్లాల వారీగా పార్టీ పరిస్థితిని సమీక్షిస్తా. పరిషత్, జీహెచ్ఎంసీ ఎన్నికలకు సిద్ధం: ప్రభుత్వం త్వరలో ప్రాదేశిక నియోజకవర్గాల(పరిషత్)కు, జీహెచ్ఎంసీ, వరంగల్, సిద్దిపేట, ఖమ్మం నగరపాలక సంస్థలకు ఎన్నికలు నిర్వహించే అవకాశముంది. ఈ నేపథ్యంలో ఇప్పటి నుంచే కార్యకర్తలను ఎన్నికలకు సమాయత్తం చేయాలి. జీహెచ్ఎంసీలో మెజారిటీ డివిజన్లు గెలుపొందేలా వ్యూహాలను రచించాలి" అని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో పార్టీ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, జీవన్‌రెడ్డి, ఎస్. మధుసూదనాచారి, ఎల్.రమణ, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్, టి.రవీందర్‌రావు, డా.పల్లా రాజేశ్వర్‌రెడ్డి, డా.బండాప్రకాశ్, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, జోగినపల్లి సంతోష్‌కుమార్, వి.గంగాధర్‌గౌడ్, మహమూద్ అలీ, కేఆర్ సురేశ్‌రెడ్డి, సోమా భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవాణి టికెట్ల 'హైజాక్'

తిరుమల: శ్రీవారి భక్తుల భక్తిని కొందరు అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. 'శ్రీవాణి ట్రస్ట్'కు విరాళమిచ్చేవారికి కేటాయించే దర్శన టికెట్లు ఇప్పుడు ప్రైవేటు ట్రావెల్స్ సంస్థల చేతుల్లో బందీ అవుతున్నాయి. సాధారణ భక్తులు వెబ్‌సైట్‌లో వివరాలు నింపేలోపే.. హైటెక్ పరిజ్ఞానంతో ప్రైవేటు ఏజెంట్లు 'హైజాక్' చేస్తున్నారు. ఒక్కో టికెట్‌పై రూ.3,000 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. ఇటీవలే ఈ అక్రమ ఉదంతం వెలుగులోకి రావడంతో తితిదే విజిలెన్స్ విభాగం రంగంలోకి దిగింది.

**సాఫ్ట్‌వేర్ మాయాజాలం**

ప్రతిరోజు ఆన్‌లైన్‌లో 800 శ్రీవాణి టికెట్ల జారీ చేస్తున్నారు. వీటి బుకింగ్‌లో ప్రైవేట్ నెట్ సెంటర్లు, ట్రావెల్స్ ఏజెంట్లు 'ఆటోఫిల్లింగ్' తదితర థర్డ్ పార్టీ సాఫ్ట్‌వేర్లను వాడుతున్నట్లు గుర్తించారు. అధికారిక వెబ్‌సైట్ పూర్తిస్థాయిలో లోడ్ అవ్వకముందే ఈ టూల్స్ ద్వారా సమాచారాన్ని సర్వర్‌లోకి పంపుతున్నారు. భక్తుల ఆధార్ వివరాలను ముందే సేకరించి సాఫ్ట్‌వేర్‌లో సిద్ధంగా ఉంచడంతో సామాన్య భక్తుల కంటే వేగంగా వీరు బుకింగ్ పూర్తి చేస్తున్నారు. గతంలో రోజుకు 200 నుంచి 250 టికెట్లు ఇలాగే పక్కదారి పట్టినట్లు సమాచారం. వెబ్‌సైట్ సర్వర్ ఎనేబుల్ అయిన వెంటనే ఈ స్థాయిలో అక్రమ బుకింగ్‌లు జరగడం వెనుక ఐటీ విభాగంలోని కొందరి అంతర్గత సహకారం ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఎలక్ట్రానిక్ డేటా ప్రాసెసింగ్ విభాగానికి విజిలెన్స్ అధికారులు లేఖ రాశారు. ఒకే ఐపీ అడ్రస్ నుంచి, ఒకే మొబైల్ నంబరుపై పెద్ద సంఖ్యలో టికెట్లు బుక్ అయ్యాయా, ప్రైవేటు వ్యక్తులకు భక్తుల ఆధార్ డేటా ఎలా అందుతోంది, హ్యాకింగ్ జరుగుతోందా, లోపల ఎవరైనా సహకరిస్తున్నారా అనే కోణాల్లో విచారణ సాగుతోంది.

**మెసేజ్ పెట్టు.. టికెట్ పట్టు**

ఈ నెల 6న చెన్నైకి చెందిన ఇద్దరు భక్తులు ఇచ్చిన ఫిర్యాదుతో ఈ దందా బయటపడింది. చెన్నైకి చెందిన ఎంఎస్ పద్మావతి ట్రావెల్స్ అనే సంస్థ శ్రీవాణి టికెట్ల పేరుతో భారీగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. ఆన్‌లైన్‌లో టికెట్ కావాలని మెసేజ్ చేస్తే చాలు రూ.13,500 డబ్బులు పంపండి.. మీకు టికెట్ వస్తుందని సమాధానమిస్తున్నట్లు విజిలెన్స్ విభాగం గుర్తించింది. రూ.10,500 టికెట్‌కు భక్తుల నుంచి అదనంగా రూ.3,000 గుంజుతున్నారు. ఈ వ్యవహారంపై 7వ తేదీన తిరుమల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు చెన్నై వెళ్లాయి. ఆ ట్రావెల్స్ వెబ్‌సైట్‌ను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టారు. టికెట్ బుక్ చేసినప్పుడు ఫొటో తీసి, దర్శనం వద్ద ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ ద్వారా పరిశీలిస్తే ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేయొచ్చని నిపుణులు సూచిస్తున్నారు. గతంలో బెంగళూరుకు చెందిన ఒక సంస్థ దీనిపై ప్రయోగాత్మక పరిశీలన కూడా చేసింది.

**నిందితులపై కఠిన చర్యలు**

ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి దర్యాప్తు జరుగుతోంది. శ్రీవాణి టికెట్లు బల్క్‌గా బుక్ చేసే సంస్థలను బ్లాక్ లిస్ట్‌లో పెడుతున్నాం. భక్తులను మోసగించే ట్రావెల్స్ ఏజెంట్లపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

# నీట్ పరీక్ష రద్దు

న్యూఢిల్లీ : దేశంలోనే ఎంతో ప్రతిష్ఠాత్మక ప్రవేశపరీక్ష నీట్ యూజీ2026 రద్దయ్యింది. ఈ పరీక్షకు సంబంధించిన ప్రశ్నాపత్రం రాజస్థాన్‌లో లీక్ అయ్యిందనే ఆరోపణలతో ఈ ప్రవేశ పరీక్షను రద్దు చేస్తున్నట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రకటించింది. ఈ నెల 3వ తేదీ జరిగిన నీట్ పరీక్షను దేశవ్యాప్తంగా 22 లక్షలమంది రాసారు. పరీక్షల్ని సమర్థవంతంగా నిర్వహించడంలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రశ్నాపత్రం లీకైన విషయం నిర్ధారణ కాగానే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్ కేంద్రాన్ని సంప్రదించారు. కేంద్రం వెంటనే సీబీఐ విచారణకు ఆదేశించింది. ఆ వెంటనే ప్రశ్నాపత్రాలు ముద్రించిన నాసిక్ ప్రింటింగ్ ప్రెస్ నుంచి ఒకర్ని అరెస్టు చేసినట్టు తెలిసింది. లీకేజీతో నష్టపోయిన ఆశావాహులకు న్యాయం చేయడానికి త్వరలో మళ్లీ పరీక్ష నిర్వహిస్తామనీ, దీనికి సంబంధించిన తేదీని త్వరలో ప్రకటిస్తామని ఎన్‌టీఏ పేర్కొంది. ఈ ప్రక్రియ పదిరోజుల్లో ప్రారంభమవుతుందని తెలిపింది. మళ్లీ పరీక్ష రాయబోయే విద్యార్థులు ఎవరూ కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. పాత రిజిస్ట్రేషన్ డేటానే పరిగణలోకి తీసుకుంటామని వెల్లడించింది. గతంలో ఎంచుకున్న పరీక్షా కేంద్రాలే ఉంటాయనీ, ఎలాంటి అదనపు రుసుము ఉండబోదని తెలిపింది. నీట్ యూజీ పరీక్షను దేశవ్యాప్తంగా ఈ నెల 3న నిర్వహించారు. 551 నగరాలు, ఇతర దేశాల్లోని 14 సిటీల్లో నిర్వహించిన ఈ పరీక్ష?కు దాదాపు 22 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. తాజాగా పరీక్షను రద్దు చేస్తూ ఎన్‌టీఏ నుంచి ఊహించని ప్రకటన రావడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో తీవ్ర నైరాశ్యం నెలకొంది.

**సీబీఐ దర్యాప్తు.. కేసు నమోదు**

పేపర్ లీకేజీ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరపాలని కేంద్రం నుంచి ఆదేశాలు రావడంతో సీబీఐ రంగంలోకి దిగింది. కేంద్ర విద్యాశాఖ ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసింది. నేరపూరిత కుట్ర, మోసం, ఇతర నేరాలకు సంబంధించి బీఎన్ఎస్‌లోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు అధికారులు వెల్లడించారు. కాగా ఈ కేసును దర్యాప్తు చేస్తున్న రాజస్థాన్ పోలీసుల స్పెషల్ ఆపరేషన్ గ్రూపు నుంచి సమాచారాన్ని సేకరించేందుకు త్వరలోనే అక్కడికి ఓ బృందాన్ని అధికారులు పంపనున్నారు. విచారణకు అవసరమైన అన్ని రికార్డులనూ సీబీఐకి అందించి పూర్తిగా సహకరిస్తామని ఎన్‌టీఏ స్పష్టం చేసింది.

**మహారాష్ట్రలో ఒకరి అరెస్ట్**

మహారాష్ట్ర పోలీసులు నీట్ లీకేజీ వ్యవహారంలో ఒక వ్యక్తిని అరెస్ట్ చేశారు. నాశిక్‌లో ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయాన్ని పోలీసు అధికారి డీసీపీ కిరణ్‌కుమార్ చెప్పారు. రాజస్థాన్ నుంచి పోలీసుల బృందం వచ్చి ఆయనను కస్టడీలోకి తీసుకుంటుందని తెలిపారు. ఇటు పేపర్ లీకేజీ వ్యవహారం కూడా రాజకీయంగా తీవ్ర దుమారాన్నే రేపుతోంది. వరుస లీకేజీ ఘటనలపై కేంద్రం వైఫల్యాన్ని పలు పార్టీల నాయకులు ప్రశ్నిస్తున్నారు.

# బంగారంపై సాగు రుణమా.. బాదేయ్

అమరావతి: బంగారాన్ని బ్యాంకులో తాకట్టు పెట్టి రుణం తీసుకోవాలనుకుంటున్న రైతుల అవసరాలను వాణిజ్య బ్యాంకులు సొమ్ము చేసుకుంటున్నాయి. పంట పెట్టుబడి పేరుతో ఇచ్చే రుణంపై సగటున ఏడాదికి 910% వడ్డీ, ఆపై ప్రాసెసింగ్, అప్రైజర్ ఛార్జీల రూపేణా ఎంత వసూలు చేస్తున్నాయో కూడా కొన్ని బ్యాంకులు రైతులకు చెప్పడం లేదు. అంతా మా చేతిలోని పనే కదా అన్నట్లు వారికి ఇచ్చే అప్పు నుంచి మినహాయించుకుంటున్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులు కూడా ప్రైవేటు బ్యాంకులు, ఫైనాన్స్ కంపెనీల మాదిరిగానే వ్యవహరిస్తున్నాయి. సాగు పెట్టుబడికి తీసుకునే రుణంగా ఇస్తున్నా, దానిపై వడ్డీ రాయితీ అమలు కావడం లేదు. ఇటీవలి వరకు ఒక ప్రభుత్వరంగ బ్యాంకు అయితే బంగారంపై రూ.2.25 లక్షలే అప్పు ఇస్తామని, అంతకుమించితే ఇన్‌కమ్ సర్టిఫికెట్, ఐటీ రిటర్న్స్, శాలరీ స్లిప్స్ కావాలని అడిగింది. ఇతర బ్యాంకులకు లేని నిబంధన ఈ ఒక్క బ్యాంకుకే ఎందుకంటూ ఖాతాదారులు ప్రశ్నించడంతో వెనకడుగు వేసింది.

**సురక్షిత రుణానికి ఇన్ని తిరకాసులా?**

బంగారంపై ఇచ్చే రుణాలను బ్యాంకులు సురక్షిత రుణాలుగా భావిస్తాయి. తాకట్టు పెట్టే ఆభరణాల విలువలో 75% వరకే రుణంగా ఇస్తున్నాయి. అప్పటికీ, బంగారం నాణ్యత, తరుగును నిపుణులతో పరిశీలింపజేస్తారు. సిబిల్ స్కోర్ చూస్తారు. ఇన్ని చూశాక ఆ అప్పు చెల్లింపునకు వచ్చిన ఢోకా ఏమీ ఉండదు. ఒకవేళ చెల్లించకపోతే నగలను వేలం వేసి వసూలు చేసుకుంటాయి.

# తెలంగాణకు 22, ఏపీకి 10 టీఎంసీలు

హైదరాబాద్ : వేసవిలో తాగు నీటి అవసరాలకు గాను తెలంగాణకు 22 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కు 10 టీఎంసీల కృష్ణా జలాలను విడుదల చేయాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) కీలక నిర్ణయం తీసుకుంది. మంగళవారం హైదరాబాద్‌లోని జలసౌధలో జరిగిన కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ సమావేశంలో రెండు రాష్ట్రాల తాగునీటి అవసరాలు, అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, ఏ రాష్ట్రానికి ఎంత నీరు విడుదల చేయాలనే అంశంపై చర్చించి ఈ వేసవి వాటాలను బోర్డు నిర్ణయించింది. తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ నుంచి 10 టీఎంసీలు ఏపీకి, తెలంగాణకు సాగర్ నుంచి 16, శ్రీశైలం నుంచి 5 టీఎంసీల వినియోగానికి కేఆర్ఎంబీ అనుమతిచ్చింది. ఏపీ ఇప్పటికే ఎక్కువ నీరు వాడుకుందని సమావేశంలో తెలిపిన తెలంగాణ, సాగర్‌లో ఏపీకి 10 టీఎంసీలు పోగా మిగిలిన మొత్తం నీరు తమకే చెందుతుందని వాదించింది. తాగునీటి అవసరాల కోసం నీటిని అడుగుతున్నట్టు ఏపీ ఈఎన్సీ తెలిపారు. మిగతా అంశాలు కాకుండా అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి కోసం వినియోగించుకునేలా నిర్ణయం తీసుకుందామని బోర్డు సభ్య కార్యదర్శి తెలిపారు. దాంతో రెండు రాష్ట్రాలు బోర్డు నిర్ణయాన్ని అంగీకరించారు. కాగా తమకు 18 టీఎంసీలు కావాలని తెలంగాణ అభ్యర్థించగా, మరో మూడు టీఎసీలు అదనంగా కేటాయించడం గమనార్హం. ఈ ఒప్పందం ఆగస్టు 15 వరకు అమల్లో ఉంటుందని కేఆర్ఎంబీ వర్గాలు తెలిపారు. ఈ నెల 14న కేఆర్ఎంబీ 21వ సమావేశం జరగనుంది. కష్ణానది నీటి వాటాలు, శ్రీశైలం, నాగార్జున సాగర్ నిర్వహణ, ఇతర అంశాలపై చర్చించనున్నారు. ఈ సమావేశంలో కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శి సతీష్ కాంబోజు, తెలంగాణ, ఏపీలకు చెందిన ఈఎన్సీలు రమేశ్‌బాబు, నరసింహమూర్తి పాల్గొన్నారు.

# సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడం మన బాధ్యత

*** కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: హనుమాన్ జయంతి పర్వదినం భక్తిశ్రద్ధల సమాహారమని, ఆధ్యాత్మికతతో పాటు ప్రతి ఒక్కరిలో సామాజిక బాధ్యత పెరగాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం నియోజకవర్గ పరిధిలోని పలు దేవాలయాలను ఆయన సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో హనుమంతుడు ధైర్యానికి, నిస్వార్థ భక్తికి నిలువుటద్దమని కొనియాడారు. అనంతరం భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణను ఆయన ప్రారంభించి, నియోజకవర్గ ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, నాయకులు మొహమ్మద్ యూసుఫ్, బోయిన విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆంజనేయ స్వామి జయంతి వేడుకల్లో ముస్లిం భక్తుడు ప్రార్థనలు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ మున్సిపాలిటీ ఆరవ వార్డు బేతోలులో భారతీయ సంప్రదాయంలో అత్యంత పవిత్రమైన పర్వదినాల్లో హనుమాన్ జయంతి ఒకటి. శ్రీరామ భక్తుడైన ఆంజనేయ స్వామి జన్మదిన రోజు భక్తులు ఘనంగా భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలలో ముస్లిం భక్తుడు షేక్ ఖాదర్ బాబా ఆంజనేయస్వామి ఆలయంల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్రామ ప్రజలతో కలిసి భక్తిశ్రద్ధలతో హనుమంతుని దర్శించుకున్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా షేక్ ఖాదర్ బాబా మాట్లాడుతూ ఆంజనేయ స్వామి ఆశీస్సులతో గ్రామం క్షేమంగా ఉండాలని, ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని భక్తులు సకల కోరికలు తీరాలని కోరారు.

# ప్రత్యేక ఆకర్షణగా 'అమ్ములు హనుమాన్'



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: జిల్లా కేంద్రంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన హనుమాన్ జయంతోత్సవ శోభాయాత్రలో 'అమ్ములు హనుమాన్' ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పాల్వంచలోని నవభారత్‌కు చెందిన శైలజ గత ఏడాది కాలంగా చిన్న వానరాన్ని సాదుకుంటున్నారు. ఆ వానరానికి 'అమ్ములు హనుమాన్' అని నామకరణం కూడా చేశారు. అమ్ములు హనుమాన్ ద్వారా స్వయంగా ఆ హనుమంతులవారే తమ ఇంట్లో ఉన్నారనే భావన కలుగుతుందని ఈ సందర్భంగా శైలజ పేర్కొన్నారు. శోభాయాత్రలో 'అమ్ములు హనుమాన్'ను భక్తులు తాకుతూ పరవశించిపోయారు. ఆ హనుమంతులవారే శోభాయాత్రకు స్వయంగా విచ్చేశారని భక్తులు విశ్వసిస్తున్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి... మరోకరికి తీవ్ర గాయాలు



జనగామ / లింగాల ఘణపురం , ప్రజాస్ఫూర్తి: లింగాల ఘణపురం మండల పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన స్వీయ రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరోకరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై శ్రవణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకా రం జీడికల్ గ్రామానికి చెందిన కొండబోయిన రాజు (48) తన ద్విచక్ర వాహనం నంబర్ టీఎస్ 27 ఎ2280 పై నెల్లుట్ల నుంచి లింగాల ఘణపురం వైపు వెళ్తుండగా, చిర్రా ఫిల్లింగ్ స్టేషన్ సమీపంలో వాహనం అదుపు తప్పి రోడ్డుపక్కన ఉన్న రాళ్లపై పడిపోయింది. ఈ ప్రమాదంలో రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. ద్విచక్ర వాహనం పై వెనుక కూర్చున్న కొండబోయిన రాములు తీవ్రంగా గాయపడగా, 108 అంబులెన్స్‌లో జిల్లా కేంద్రం లోని ఏరియా ఆసుపత్రికి తరలించి, చికిత్స అందించారు. తన పరిస్థితి విషమంగా ఉండంతో మెరుగైన చికిత్స కోసం డాక్టర్లు హైదరాబాద్ కు రిఫర్ చేశారని తెలిపారు. ఈ ఘటన పై కేసు నమోదు చేసు కొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

# అన్నపూర్ణమ్మ ఫౌండేషన్‌కు వడ్డెర సంఘం చేయూత



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: అన్నపూర్ణమ్మ ఫౌండేషన్‌కు వడ్డెర సంఘం ముస్తాబాద్ మండల అధ్యక్షుడు ఒల్లెపు చందు చేయూతనిచ్చారు. మంగళవారం ముస్తాబాద్ మండలం గూడెం గ్రామంలోని అన్నపూర్ణమ్మ ఫౌండేషన్‌కు రూ.7000 ల విలువైన నూనెలు, పప్పులు, దినుసులు వంటి నిత్యావసర వస్తువులను ఆయన బహుకరించారు. వీటితోపాటు రూ.3000 ల నగదును ఫౌండేషన్ ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా వడ్డెర సంఘం మండల అధ్యక్షుడు మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సామాజిక బాధ్యతగా ఫౌండేషన్‌కు అండగా ఉంటానని, భవిష్యత్తులోనూ తన సహాయం కొనసాగుతుందని వివరించారు.ఈ సేవా కార్యక్రమంలో సహకార విద్యుత్ సరఫరా సంఘం (సెస్) డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, ముస్తాబాద్ మండల భారత రాష్ట్ర సమితి (భారాస) పార్టీ అధ్యక్షుడు భోంపెల్లి సురేందర్ రావు, భారాస పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సెస్ డైరెక్టర్ కొమ్ము బాలయ్య, భారాస పార్టీ నాయకులు మెంగని మనోహర్, మాజీ ఉప సర్పంచ్, వార్డు సభ్యుడు శాడా శ్రీనివాస్, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) డైరెక్టర్ కోలా పర్శరాములు గౌడ్, ఒలేపు రవి, ఫౌండేషన్ సభ్యులు కుర్ర సావిత్రి, బొప్ప విజయ లక్ష్మి, స్వరూప, విజయ, బొప్ప పద్మాలత పాల్గొన్నారు. ఈ సందర్భంగా చందు దాతృత్వానికి ఫౌండేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# బండి భగీరథను వెంటనే అరెస్టు చేయాలి

మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : కేంద్ర మంత్రి బండి సంజయ్ కొడుకు భగీరథను వెంటనే అరెస్టు చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యు) మహబూబాబాద్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ప్రగతిశీల మహిళా సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షురాలు,కల్తీ ఎర్రక్క, జిల్లా ప్రధాన కార్యదర్శి ముయ్యబోయిన భద్రక్క మాట్లాడుతూ బండి భగీరథ మైనార్టీ తీరని ఒక అమ్మాయిని ప్రలోభాలకు గురిచేసి మోసం చేసిన సెక్షన్ లో పోక్సో కేసు నమోదైన నేటికీ అరెస్టు చేయకపోవడం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమైన అని వారు తెలిపారు.కేంద్ర మంత్రిగా బండి సంజయ్ తన రాజకీయ పలుకుబడిన ఉపయోగించి కేసును తప్పుతోవ పట్టించడానికి చేస్తున్న కుట్రలను ప్రజలు గమనిస్తున్నారు.భారతదేశ చట్టాల మీద కేంద్ర మంత్రి కే గౌరవం లేకపోతే, సామాన్య ప్రజలు చట్టాన్ని ఎలా గౌరవిస్తారని వారు ప్రశ్నించారు. విచ్చలవిడి మద్యం, డ్రగ్స్ సేవిస్తూ తోటి విద్యార్థులపై సమావేశంగా దాడి చేసి కొట్టిన కేసులు గతంలో ఉండగా నేడు ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించటం సరికాదు. కేంద్ర మంత్రిగా తన కొడుకును రాష్ట్ర పోలీస్ లకు అప్పజెప్పి నిజాయితీని నిరూపించుకోవాలి.కేంద్రమంత్రి అయి ఉండి బీసీ కులం కార్డును ఉపయోగించుకోవడం సిగ్గుచేటు. హిందూ ధర్మాన్ని పాటిస్తున్నామని గావు కేకలు పెట్టే కేంద్ర మంత్రి మైనార్టీ తీరని హిందూ బాలిక నిండు జీవితాన్ని తన కొడుకు నాశనం చేస్తే ఎందుకు కేసును పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ప్రశ్నించారు. ముస్లిం, క్రిస్టియన్ మతాలకు సంబంధించిన వ్యక్తులైతే కేంద్ర మంత్రి హోదా స్థాయి మర్చిపోయి నానా యాగిచేసే వాడే కదా అని వారు అన్నారు. తన కొడుకు చేతిలో జీవితాన్ని కోల్పోయిన మహిళకు తగు న్యాయం చేసి బండి భగీరథును వేషరతుగా రాష్ట్ర పోలీసులకు అప్పజెప్పాలని వారు డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

# జై శ్రీరామ్ నినాదంతో దద్దరిల్లిన 'గూడెం'



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జై శ్రీరామ్... జై శ్రీ హనుమాన్ నినాదాలతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం దద్దరిల్లిపోయింది. శ్రీ హనుమాన్ జయంతోత్సవాన్ని పురస్కరించుకుని వానరసేన ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం జిల్లా కేంద్రంలో భారీ హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తజనసందోహంతో 'గూడెం' పరవశించిపోయింది. భారీ డీజే చప్పుళ్లతోపాటు డప్పు కళాకారులు, కోలాట నృత్యాలతో హనుమాన్, శ్రీ రామ నామస్మరణ చేస్తూ శోభాయాత్ర కొనసాగింది. చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీలోగల శ్రీ అభయాంజనేయస్వామి దేవాలయం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర ఖమ్మం - కొత్తగూడెం ప్రధాన రహదారిమీదుగా పోస్టాఫీస్ సెంటర్, బస్టాండ్ సెంటర్, సూపర్‌బజార్ సెంటర్, గణేష్ టెంపుల్ సెంటర్ మీదుగా లక్ష్మీదేవిపల్లిలోని శ్రీ దాసాంజనేయస్వామి ఆలయం వరకు కొనసాగింది. రోడ్డుకు ఇరువైపులా హిందూ బంధువులు హనుమాన్ జెండాలు పట్టుకుని శోభాయాత్రకు స్వాగతం పలికారు. ఓ వ్యక్తి భారీ హనుమాన్ వేషాధారణలో అందరినీ ఆకట్టుకున్నారు. భారీ హనుమాన్, శివుడి విగ్రహాలు శోభాయాత్రలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భారీగా తరలివచ్చిన జనసందోహంతో ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించారు.


# హనుమాన్ జయంతి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

*** మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి**



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: హనుమాన్ జయంతి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రం శాంతినగర్ శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా కొత్త పవన్ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంజనేయ స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ ఎలుగూరి ఇందిరా వీరయ్య గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ షేక్ అబ్దుల్ కరీం, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు పిండిగ విజయ్ కుమార్, వెన్న ఉపేందర్, అంతటి పాపయ్య, ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు బంధం విష్ణు నాని, పట్టణ కాంగ్రెస్ నాయకులు కసిమల్లా అనుదీప్, దోమల ప్రదీప్, మగిడిమర్రి నవీన్, నామ మోహన్, షేక్ రహీం, నర్సింగ్ కిరణ్, కోడి కిరణ్, అనంతుల నవీన్, షేక్ గౌస్ పాషా, పిల్లల నాగరాజు, రాచకొండ శివమణి, అర్చకులు వినోద్ శర్మ, నాగయ్య శాస్త్రి, కొత్త రామ నరసయ్య, ఆండాలు, భార్గవి, బిక్కుమల్ల పుష్పవతి, రాఘవేంద్ర, అనిత, తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి, చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కడియం





జనగామ / లింగాల ఘణపురం, ప్రజాస్ఫూర్తి : లింగాల ఘణపురం మండల కేంద్రం లోని తహసీల్దార్ కార్యాలయం ఆవర ణ లో నిర్వహించిన కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కడియం శ్రీహరి పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో మండలానికి చెందిన 51 మంది కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లబ్ధిదారులకు రూ.51 లక్షల 5 వేల 916 విలు వైన చెక్కులు, 18 మంది ముఖ్య మంత్రి సహాయ నిధి లబ్ధిదారుల కు రూ.6 లక్షల 84 వేల చెక్కు లను అందజేశారు. ఈ సందర్భం గా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇక పై కళ్యాణ లక్ష్మి చెక్కులను లబ్ధి దారుల ఇంటి వద్దనే అందించే విధంగా చర్యలు తీసుకుంటా మని తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలులో అవినీతికి ఆస్కారం లేకుండా ప్రజా ప్రతి నిధులు, అధికారులు పని చేయా లని సూచించారు. కళ్యాణ లక్ష్మి పథకానికి దరఖాస్తు చేసిన రెండు నెలల్లోపు చెక్కులు అందించే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. గ్రామాల్లో వివాహం జరిగిన నెల రోజులలోపు దరఖా స్తులు చేసుకునేలా సర్పంచ్లు చొరవ తీసుకోవాలని సూచించిన ఎమ్మెల్యే,ఆడపిల్లల తల్లిదండ్రుల ఆర్థిక ఇబ్బందులను దృష్టి లో పెట్టుకుని ప్రభుత్వం రూ.1,00,1 16 ఆర్థిక సహాయం అందిస్తోంద న్నారు. సంక్షేమ పథకాలను అర్హు లైన పేదల ఇంటి వద్దకు చేర వేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

# బెల్ట్ షాప్ నిర్వాహకుని బైండోవర్



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండలంలోని కొండాపూర్, గూడెం గ్రామాల బెల్ట్‌షాప్ నిర్వహకున్ని పోలీసులు మంగళవారం బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ముస్తాబాద్ ఎస్.ఐ సిహెచ్. గణేష్ మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరూ కూడా అక్రమంగా మద్యం అమ్మకాలు జరుపరాదన్నారు. అక్రమంగా మద్యం అమ్మకాలు జరిపితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

# ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: జిల్లా కేంద్రంలోని విద్యా నగర్ లో గల శ్రీరామలింగేశ్వర సహిత త్రిశక్తి అయ్యప్ప ఆంజనేయ స్వామి వారి దేవాలయంలో మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ ప్రధాన అర్చకులు రెంటాల సతీష్ కుమార్ శర్మ, దుర్గాప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామివారికి మహా పంచామృత అభిషేకం, అలంకరణ సేవ నిర్వహించారు. స్వామివారికి నాగవెల్లి దళార్చన, పుష్పార్చన నిర్వహించారు. స్వామి వారికి ప్రీతికరమైన వడపప్పు, బెల్లం పానకం, వడలు నైవేద్యంతో పాటు 16 రకాల ప్రసాదాలను సమర్పించి భక్తులకు వితరణ చేశారు. సాయంత్రం దేవాలయంలో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అనంతుల గణేష్ రామలింగయ్య, ధర్మకర్తలు అనంతుల సూర్యనారాయణ, అనంతుల దుర్గాప్రసాద్, అనంతుల శ్రీనివాస్, అనంతుల యుగేందర్, సందీప్, సత్యనారాయణ, డైమండ్ జ్యువెలరీస్ పోలిశెట్టి శ్రీనివాస్, సూర్యాపేట హాస్పటల్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, రక్ష హాస్పిటల్ పాపిరెడ్డి, తీగల ఉపేందర్, ప్రతిభ జూనియర్ కళాశాల కె.సత్యంబాబు, కె.వెంకటరెడ్డి, తెడ్ల ప్రభాకర్, చల్లా లక్ష్మీకాంత్, చల్లా లక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో డీజేలు పూర్తిగా నిషేధం – నిబంధనలు ఉల్లంఘించే డీజే యజమానులపై కఠిన చర్యలు

*** జిల్లా ఎస్పీ నితిక పంత్**

ప్రజా స్ఫూర్తి ,కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా: కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో డీజే సిస్టమ్‌ల వినియోగం పూర్తిగా నిషేధించబడిందని జిల్లా ఎస్పీ నితిక పంత్ తెలిపారు. మైక్ బాక్సులు, సౌండ్ సిస్టం ల అనుమతి కొరకు స్థానిక ఎస్.డి.పి.ఓ కార్యాలయం నుండి ముందస్తుగా అనుమతి పొందాలని, అదేవిధంగా రాత్రి 10 గంటల తర్వాత శబ్ద కాలుష్యం కలిగించే మైక్ బాక్సులు, లౌడ్ స్పీకర్లు, భారీ సౌండ్ సిస్టమ్‌ల వినియోగానికి కూడా అనుమతి లేదని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలు మరియు శబ్ద కాలుష్య నియంత్రణ నిబంధనల ప్రకారం ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా అధిక శబ్దంతో సౌండ్ సిస్టమ్‌లు వినియోగించడం నిషేధించబడిందని తెలిపారు. వివాహాలు, శుభకార్యాలు, ఊరేగింపులు, ఇతర కార్యక్రమాల సమయంలో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు పరికరాలను స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నిబంధనలు ఉల్లంఘించే వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని, ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా డీజేలు లేదా అధిక శబ్దంతో మైక్ బాక్సులు వినియోగిస్తున్నట్లు గమనిస్తే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

# ఘనంగా సాయిబాబా మందిరం 13వ వార్షికోత్సవం



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : పట్టణంలోని ముషం పల్లి రోడ్డు సాయి నగర్ లోని శ్రీ షిరిడి సాయి బాబా మందిరం 13వ వార్షికోత్సవం మంగళ వారం ఘనంగా నిర్వహించారు. ఉదయం కాగడ హారతి, విఘ్నేశ్వర పూజ, మూల విరాట్ సాయిబాబా విగ్రహానికి అభిషేకము, అలంకరణ, దివ్య దర్శనం, మధ్యాహ్నం హారతి, తీర్థ ప్రసాద వితరణ, అన్న ప్రసాద వితరణ, రాత్రి పల్లకి సేవ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బుర్రి భూపతిరెడ్డి, వైస్ చైర్మన్ గౌర్రె సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎర్రబెల్లి కోటిరెడ్డి, సభ్యులు సిరిగిరి శ్రీనివాస్ రెడ్డి, జాలిపర్తి నాగేశ్వరరావు, గుండె గోని పరమేశం, మాధగోని రాములు, చండా జగదీశ్వర్, బుర్రి వెంకట్ రెడ్డి, కట్ట దశరథ్ రెడ్డి, తాడూరి నరసింహ చారి, కాసర్ల నిర్మల తదితరులు పాల్గొన్నారు


## ఈనెల 13న పాలిసెట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేయాలి

* అదనపు కలెక్టర్ శ్రీనివాస్



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : ఈనెల 13న నిర్వహించనున్న పాలిసెట్ 2026 పరీక్షకు అవసరమైన అన్ని ఏర్పాటు చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ ఆదేశించారు. పాలిసెట్ 2026 పరీక్ష నిర్వహణ విషయమై మంగళవారం అయన తన చాంబర్లో సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.పాలిసెట్ 2026 పరీక్ష నిర్వహణకు గాను నల్గొండ జిల్లాలో మొత్తం 15 పరీక్ష కేంద్రాల ఏర్పాటు చేయడం జరిగిందని, నల్గొండ పట్టణంలో 13, నాగార్జునసాగర్ లో 2 కేంద్రాలు ఏర్పాటు చేశామని, పాలిసెట్ పరీక్షకు 5810 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని,పరీక్ష ఈ నెల 13 న ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1.30 వరకు ఉంటుందని తెలిపారు. పాలిసెట్ పరీక్ష సక్రమంగా నిర్వహించేందుకుగాను అవసరమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని అడిషనల్ ఎస్పీ రమేష్ ను కోరారు. పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు తో పాటు, పేపర్ ను భద్రపరిచేందుకు ఎస్కార్ట్ ,అవసరమైన ఇతర భద్రత సౌకర్యాలను కల్పించాలని కోరారు.అదేవిధంగా పరీక్ష రోజున పరీక్షా కేంద్రాల పరిధిలో ఎలాంటి విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారులను, అన్ని పరీక్ష కేంద్రాల వద్ద ప్రథమ చికిత్స సౌకర్యాలు ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆయన ఆదేశించారు. అలాగే పరీక్షా కేంద్రాల పరిధిలో బిఎన్ఎస్ 163వ సెక్షన్ అమల్లో ఉంటుందని చెప్పారు. పరీక్ష రోజున ఆర్టీసీ అధికారులు అవసరమైనన్ని బస్సులను నడపాలని ఆర్ టి సి అధికారులను ఆదేశించారు.పాలిసెట్ 2026 నిర్వాహకులు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ జిల్లా కోఆర్డినేటర్ సిహెచ్ నరసింహారావు, ఆర్టీసీ, వైద్య ఆరోగ్య, ట్రాన్స్కో, ఇతర సంబంధిత శాఖల అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి : హనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా వినాయక్ నగర్లో శ్రీరామ యువసేన ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి విగ్రహం , చిత్రపటానికి పూలదండలతో ప్రత్యేక అలంకరణ చేసి ఘనంగా పాలాభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు పులిహోర ప్యాకెట్లు, అన్నప్రసాదాలు, మజ్జిగను భారీ ఎత్తున పంపిణీ చేశారు.ఈ సందర్భంగా శ్రీరామ యువసేన సభ్యులు మాట్లాడుతూ హనుమాన్ జయంతి వేడుకలను యువత భక్తి, సేవా భావంతో నిర్వహించడం ఆనందదాయకమన్నారు. వినాయక్ నగర్ ప్రాంతంలో భక్తిమయ వాతావరణం నెలకొనగా, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని జై శ్రీరామ్, జై హనుమాన్ నినాదాలతో కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఆంజనేయస్వామి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీర్వాదాలు పొందారు.ఈ కార్యక్రమంలో కల్లెపు సంతోష్ గౌడ్, వల్లభ టిల్లు యాదవ్, చెన్నోజు అనిల్ చారి, కల్లెపు సాయి ప్రసాద్ గౌడ్, గణేష్ గౌడ్, రాహుల్, మహేష్, అలీ శ్రీనాథ్, గోరక్ సంతోష్, గట్టు వినయ్ గౌడ్, సుంకోజు తరుణ్ తేజ్, ఓరగంటి మహేష్, మెడబోయిన సాయికుమార్ ముదిరాజ్, కర్పే శివకుమార్, కల్లపు సురేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## జల హనుమాన్ ఆలయంలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



మెదక్ జిల్లా ,ప్రజాస్ఫూర్తి : మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం చిన్నచింతకుంట సమీపంలోని శ్రీ జల హనుమాన్ ఆలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, సుబ్రమణ్య స్వామి ఆలయాన్ని ప్రారంభించిన మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ ఈ సందర్భంగా హనుమాన్ మాల దీక్ష స్వాములతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆంజనేయస్వామి వారి కృపాకటాక్షాలతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.. జాల హనుమాన్ ఆలయనికి మరింత అభివృద్ధి చేయడానికి తనవంతు సహాయంగా చేస్తానని హామీ ఇచ్చారు. త్వరలోనే ఆలయం వద్ద తాగు నీరు సమస్య తీర్చడానికి బోరు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, రెడ్డిపల్లి సర్పంచ్ పద్మావతి అశోక్ గౌడ్,నాయకులు, కార్యకర్తలు, హనుమాన్ మాల దీక్ష స్వాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు..

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా : మెదక్ పట్టణం గోసముద్ర తటాక తీరాన వెలసిన శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వంశానుగత ధర్మకర్త కాకులవరం మధుసూదనాచారి ఆధ్వర్యంలో ఉదయం నుంచి స్వామివారికి ఆవుపాలతో అభిషేకం, మహా అలంకరణ, మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ గావించారు. సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం, లోక కల్యాణార్థం హోమం నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు. మెదక్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

# అంతర్జాతీయ నర్సుల దినోత్సవం వేడుకలు



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : నల్గొండ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డిసిహెచ్ఎస్ డాక్టర్ మాత్రు..నర్సింగ్ అధికారులతో కలిసి ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కేక్ కట్ చేసి నర్సులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సులు అందించే సేవలను విస్తృతం చేసి ప్రాణాలు కాపాడాలని అన్నారు. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో ఫ్లోరెన్స్ నైటింగేల్ చేసిన సేవలకు గుర్తుగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం జరుపుకుంటారని తెలిపారు. ఎలాంటి సౌకర్యాలు లేని సమయంలో ఫ్లోరెన్స్ నైటింగేల్ చేసిన సేవలను నేటి తరం నర్సులు స్ఫూర్తిగా తీసుకొని ప్రజలకు సేవలు అందించాలని కోరారు. నర్సింగ్ సేవలు లేకుండా ఏ ఆసుపత్రి కూడా నడవదని, వారి సేవలను ప్రభుత్వం గుర్తించి వారికి నర్సింగ్ ఆఫీసర్లుగా గుర్తింపును కల్పించిందని చెప్పారు. నర్సింగ్ అధికారుల సేవలను బలోపేతం చేస్తూ ప్రభుత్వం వివిధ విభాగాలలో వారి సేవలను పొందుతోందని, నర్సులకు అవసరమైన సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందని చెప్పారు. నర్సింగ్ అధికారుల మానవత్వం, సేవలను గుర్తించి ప్రభుత్వం వారిని ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నగేష్, ఆర్ ఎం ఓ చంద్రశేఖర్, నర్సింగ్ సూపరింటెండెంట్లు నీలాబాయి, సుజాత, రేణుకా దేవి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలి

* జిల్లా కలెక్టర్ సంధీప్ కుమార్ ఝా..



జనగామ, ప్రజాస్ఫూర్తి : రోడ్డు భద్రత ప్రమాణాలు, మార్గ దర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సందీప్ కుమార్ ఝా సూచించారు.మంగళవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం లోని కాన్ఫరెన్స్ హాల్ లో డీసీపీ రాజ మహేంద్రనాయక్ తో కలిసి జిల్లా కలెక్టర్ రహదారి భద్రతపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు సంబంధించిన రెండు నేషనల్ హైవేలపై రెండు లేన్ల రహదారి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో రహదారులకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను పంచాయతీ కార్యదర్శుల ద్వారా తొలగించాలని సూచించారు. నేషనల్ హై వేల వద్ద ప్రయాణికుల భద్రత కోసం అవసరమైన రహదారి భద్రత ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని తెలిపారు. రహదారులకు ఇరువైపులా ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా సరిపడా లైటింగ్ ఏర్పాటు చేయాలని, ఎక్కువ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో "గో స్లో" వంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రమాదాలు సంభవించిన సమయంలో అత్యవసర చికిత్స అందించే 108 సేవలు త్వరితగతిన క్షతగాత్రులకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాల సమీపంలోని హనుమాన్ ఆలయం వద్ద రంబుల్ స్ట్రిప్స్, జీబ్రా క్రాసింగ్ పెయింటింగ్ వేయాలని తెలిపారు. పాలకుర్తి, వావిలాల క్రాస్ వద్ద రహదారి విస్తరణ చర్యలు చేపట్టాలని, పెంబర్తి యూటర్న్ వద్ద లైటింగ్ ఏర్పాటు చేయాలని అధికారుల కు తెలియజేశారు.. ఈ సమావేశం లో ఇంచార్జి ఆర్ & బీ ఈఈ సరిత, ఆర్టీఓ శ్రీనివాస్ గౌడ్, ఎక్సైజ్ అధికారి అనిత, డీఎంహెచ్ఓ మల్లికార్జున రావు, ఆర్టీఏ సభ్యులు, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, నేషనల్ హైవే అధికారులు, పోలీసు అధికారు లు తదితరులు పాల్గొన్నారు.

## భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ వార్షిక తనిఖీలు



భూపాలపల్లి, ప్రజాస్ఫూర్తి : జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీస్ శాఖ పనితీరును మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దే దిశగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మంగళవారం భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌తో పాటు సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయాన్ని వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించారు. స్టేషన్‌లోని పరిపాలనా వ్యవస్థ, రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధి నిర్వహణ, కేసుల దర్యాప్తు పురోగతిని సమగ్రంగా పరిశీలించారు. స్టేషన్‌కు వచ్చే ప్రజలకు స్నేహపూర్వక వాతావరణంలో సేవలు అందించడంతో పాటు, వారి సమస్యలను వేగవంతంగా, పారదర్శకంగా పరిష్కరించేలా పనిచేయాలని సిబ్బందికి ఎస్పీ ఆదేశించారు. ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం మరింత పెంపొందించేలా సేవా దృక్పథంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారంపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించి, దర్యాప్తు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా "వన మహోత్సవం" కార్యక్రమంలో భాగంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్క నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ప్రకృతి సంరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం పోలీస్ సిబ్బంది శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కోసం ఏర్పాటు చేసిన బ్యాడ్మింటన్ కోర్టును ప్రారంభించారు. పరిశుభ్రమైన స్టేషన్ వాతావరణం, క్రమబద్ధమైన నిర్వహణ, ప్రజలకు మెరుగైన సేవలే పోలీస్ శాఖ ప్రతిష్ఠను పెంచుతాయని ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ పేర్కొన్నారు.

## వంద పడకల ఆసుపత్రిలో సమస్యలపై గండ్ర ఆగ్రహం

* "నీళ్లు లేని దవాఖాన.. రోగుల కష్టాలు పట్టించుకోరా?"



భూపాలపల్లి, ప్రజాస్ఫూర్తి : భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆసుపత్రిని సందర్శించిన ఆయన రోగులతో మాట్లాడి అక్కడి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు. తాగునీరు, మరుగుదొడ్లు, ఆహారం, వైద్య సేవల విషయంలో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోందని మండిపడ్డారు. ఆసుపత్రిలో కనీసం తాగడానికి కూడా నీళ్లు లేకపోవడం దారుణమని, టాయిలెట్లలో నీటి సౌకర్యం లేక రోగులు, వారి సహాయకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బయట నుంచి నీళ్లు కొనుక్కునే పరిస్థితి రావడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. ఆసుపత్రి సమీపంలోనే మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ ఉన్నప్పటికీ ఇప్పటివరకు ఆసుపత్రికి కనెక్షన్ ఇవ్వకపోవడం అధికారుల నిర్లక్ష్యమని గండ్ర ఆరోపించారు. ఈ సమస్యలను గతంలోనే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు కనిపించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. రోగులకు అందిస్తున్న ఆహారం నాసిరకంగా ఉందని, వైద్య సేవల పర్యవేక్షణ కూడా సరిగా లేదని ఆయన తెలిపారు. ఆసుపత్రిలోని మరుగుదొడ్లు అసభ్యకరంగా మారాయని, వెంటనే శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తక్షణమే నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించి, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించకపోతే ఆసుపత్రి ఎదుటే ఆందోళన చేపడతామని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## సరస్వతి అంత్య పుష్కరాలకు విద్యుత్ సన్నాహాలు వేగవంతం

* 15లోగా పనులు పూర్తి చేయాలని ఎన్‌పీడీసీఎల్ సీఎండీ ఆదేశం



కాళేశ్వరం, ప్రజాస్ఫూర్తి : సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని విద్యుత్ ఏర్పాట్లను ఈ నెల 15వ తేదీ లోపు పూర్తి చేయాలని తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఎన్‌పీడీసీఎల్) సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి, ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 21వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకు నిర్వహించనున్న పుష్కరాల ఏర్పాట్లను మంగళవారం కాళేశ్వరం వద్ద సీఎండీ స్వయంగా పరిశీలించారు. పుష్కర ఘాట్, బస్టాండ్, పార్కింగ్ ప్రాంతాలతో పాటు భక్తుల రాకపోకలు అధికంగా ఉండే ప్రాంతాల్లో జరుగుతున్న విద్యుత్ పనులను పరిశీలించారు. తాత్కాలిక విద్యుత్ లైన్లు, స్ట్రీట్ లైట్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ భద్రతా చర్యలు, నిరంతరాయ విద్యుత్ సరఫరా కోసం చేపడుతున్న ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ పుష్కరాలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు నిరంతరాయంగా, సురక్షితంగా విద్యుత్ సరఫరా అందించేందుకు ఎన్‌పీడీసీఎల్ ప్రత్యేక కార్యాచరణతో పనిచేస్తోందన్నారు. విద్యుత్ పనులలో అధిక భాగం ఇప్పటికే పూర్తయ్యిందని, మిగిలిన పనులను గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. పుష్కరాల సమయంలో విద్యుత్ అంతరాయాలు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక బృందాలు సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీఎండీ వెంట సీఈ రాజు చౌహాన్, ఎస్ఈ బేతి బిక్షపతి, డీఈ నాగరాజు, డీఈ జగదీశ్, డీఈ సదానందం తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి వేడుకలు



నల్గొండ, ప్రజా స్ఫూర్తి : హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం మారుతి మందిర్ ముషంపల్లి రోడ్డు నల్గొండలో అశేష భక్తులు హనుమాన్ అభిషేకము నిర్వహించారు. పంచామృతాలు సుగంధ ద్రవ్యాలు మొదలగు వాటితో అత్యంత భక్తి శ్రద్ధలతో అభిషేకాన్ని అర్చనను నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. సామూహిక హనుమాన్ చాలీసా కీర్తన లు జరిగాయి. హనుమాన్ అనుగ్రహం అందరికీ కలగాలని ఆశీర్వదించారు. మారుతి మందిరం భక్తులకు కాలనీ వాసులకు నలగొండ సమస్త ప్రజలకు హనుమాన్ జయంతి శుభాకాంక్షలు కమిటీ తరపున తెలిపారు. ఈ కార్యక్రమంలో మారుతి మందిరం ఆలయ కమిటీ అధ్యక్షుడు కంచర్ల భాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మంత్రవాది శ్రవణ్ కుమార్ , కోశాధికారి నామాల నరసింహ, కార్యనిర్వాహక సభ్యులు నామాల నీరజ, నేతాపురం వెంకటేశ్వర్లు, వట్టికోట కృష్ణయ్య, నామాల లక్ష్మీనారాయణ, మీరా మొదలగు వారు అశేష భక్తజనులు పాల్గొన్నారు.

## ఆయిల్ ఫామ్ పంటను ప్రోత్సహించాలి


* జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా : జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగును మరింత విస్తరించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. మంగళవారం మీరు కలెక్టరేట్ లోని మీటింగ్ హాల్ లో ఆయిల్ ఫామ్ సాగు ప్రగతి పై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ సాగు రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఆదాయం పెంచే లక్ష్యంతో ఆయిల్ ఫామ్ సాగుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. తక్కువ వ్యయంతో అధిక లాభాలు అందించే పంటగా ఆయిల్ ఫామ్ రైతులకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు.రైతులకు నాణ్యమైన మొక్కలు, ఎరువులు, సాంకేతిక సూచనలు అందించేలా వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు సాగులోకి వచ్చిన ఆయిల్ ఫామ్ విస్తీర్ణం, కొత్తగా నమోదు చేసుకున్న రైతుల వివరాలు, నీటి వనరుల లభ్యత, డ్రిప్ సౌకర్యాల ఏర్పాటు వంటి అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.అలాగే ఆయిల్ ఫామ్ పంటపై రైతుల్లో మరింత అవగాహన పెంచేందుకు ప్రత్యేక శిబిరాలు, క్షేత్ర స్థాయి పర్యటనలు నిర్వహించాలని అధికారులకు తెలిపారు. సాగు ప్రారంభించిన రైతులకు సకాలంలో సబ్సిడీలు, సాంకేతిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు సంప్రదాయ పంటలతో పాటు వాణిజ్య పంటల వైపు దృష్టి సారిస్తే ఆర్థికంగా మరింత లాభపడతారని పేర్కొన్నారు. ఆయిల్ ఫామ్ సాగు ద్వారా దీర్ఘకాలిక ఆదాయం లభిస్తుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి దేవ్ కుమార్, ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్ వ్యవసాయ శాఖ అధికారులు, ఉద్యాన శాఖ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కల్లాల వద్ద పేరుకుపోతున్న ధాన్యం రోడ్డెక్కిన నర్సాపూర్ రైతులు

* రైతులకు మద్దతుగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి



మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం , ప్రజాస్ఫూర్తి : మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని కౌడిపల్లి శివంపేట మండలాల్లో రైతులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు గత వారం పది రోజులుగా కల్లాల వద్ద పెద్ద ఎత్తున ధాన్యం పేరుకుపోయిందని కొనుగోలు సాగడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళన బాట పట్టారు శివంపేట మండలంలోని చిన్న గొట్టిముక్ల కొనుగోలు కేంద్రం వద్ద రైతులు ఆందోళన నిర్వహించారు కౌడిపల్లి మండల కేంద్రంలో కూడా రైతులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించగా ఆందోళనకు మద్దతుగా టిఆర్ఎస్ నాయకులతో పాటు ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పాల్గొని రైతులకు మద్దతు ప్రకటించారు. అకాల వర్షాలు కురిసి ధాన్యం తడిసిపోతే ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి హెచ్చరించారు నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద ఎత్తున ధాన్యం పేరుకుపోయిందని ఇక్కడ కూడా కొనుగోలు సరిగా జరగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొనుగోలలో వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు లేకుంటే రానున్న రోజుల్లో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# ప్రధాని 'అమృత్ కాలం'.. దేశానికి విషయుగంలా మారింది: రాహుల్

న్యూఢిల్లీ/చెన్నై: నీట్ యూజీ పేపర్ లీక్ వ్యవహారం తీవ్ర దుమారం రేపడంతో ఈ నెల 3న జరిగిన పరీక్షను ఎన్‌టీఏ రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈ పేపర్ లీక్ వ్యవహారంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తాజాగా స్పందించారు. దాదాపు 22 లక్షల మందికి పైగా విద్యార్థులు పడిన కష్టం, వారి కలలు భాజపా సారథ్యంలోని అవినీతి వ్యవస్థ వల్ల ఛిన్నాభిన్నమయ్యాయన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. "నీట్ పరీక్ష రద్దయింది. దేశ వ్యాప్తంగా 22లక్షల మందికి పైగా విద్యార్థుల కఠోర శ్రమ, త్యాగాలు, కలలు ఛిన్నాభిన్నమయ్యాయి. కొందరు తండ్రులు రుణాలు తీసుకున్నారు. ఇంకొందరు తల్లులు తమ నగలు అమ్ముకున్నారు. లక్షలాది మంది విద్యార్థులు ఈ పరీక్ష కోసం ఎన్నో రాత్రులు మేల్కొని ఉండి చదివారు. ఇందుకు వారికి దక్కిన ప్రతిఫలం ఏంటంటే.. పేపర్ లీకేజీలు, ప్రభుత్వ నిర్లక్ష్యం, విద్యా వ్యవస్థలో వ్యవస్థీకృతమైన అవినీతి. ఇది కేవలం ఒక వైఫల్యం కాదు.. దేశ యువత భవిష్యత్తుపై జరిగిన నేరం. ప్రతిసారి పేపర్ మాఫియా ఎలాంటి శిక్షల్లేకుండా తప్పించుకు తిరుగుతుండగా..నిజాయతీపరులైన విద్యార్థులు మాత్రం శిక్ష అనుభవిస్తున్నారు. ఇప్పుడు లక్షలాది మంది విద్యార్థులు మరోసారి



అదే మానసిక ఒత్తిడి, ఆర్థికపరమైన భారం, అస్థిరతను భరించాల్సి వస్తోంది. ఒకరి తలరాతను వారి శ్రమతో కాకుండా.. డబ్బు, పలుకుబడితో నిర్ణయిస్తుంటే ఇక విద్యకు నిజమైన అర్థం ఏముంటుంది? ప్రధాని మోదీ చెబుతోన్న 'అమృత్ కాలం'.. దేశానికి విష యుగంగా మారింది" అని రాహుల్ గాంధీ ఆక్షేపించారు.

**నీట్ వ్యవస్థే ఓ పెద్ద స్కామ్: స్టాలిన్**

నీట్ పేపర్ లీకేజీ, పరీక్ష రద్దు అంశంపై తమిళనాడు మాజీ సీఎం, డీఎంకే చీఫ్ స్టాలిన్ స్పందించారు. ఈ ఏడాది కూడా నీట్ పేపర్ లీకేజీతో లక్షలాది మంది విద్యార్థులు మానసిక వేదనకు గురయ్యారన్నారు. నీట్ పరీక్ష ప్రక్రియలో ప్రతి దశలోనూ మోసాలు ఉన్నట్లు కనబడుతోందన్నారు. అసలు నీట్ వ్యవస్థే ఓ పెద్ద కుంభకోణం అని ఆరోపించారు. ఏటా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న నీట్ పరీక్ష విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్లస్ టూ పరీక్షల్లో స్కోరు ఆధారంగానే ఎంబీబీఎస్ సీట్లు కేటాయించే పాత విధానం తిరిగి అమలు చేయాలని కోరారు. తమిళనాట కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం కూడా నీట్ పరీక్షకు వ్యతిరేకంగా తమ దృఢమైన వైఖరిని స్పష్టంగా ప్రకటించాలన్నారు. ఈ పరీక్ష నుంచి మినహాయింపు కోరుతూ గతంలో తమ ప్రభుత్వం చేసిన న్యాయపరమైన ప్రయత్నాలను ముందుకు తీసుకెళ్లాలని విజయ్ సర్కారుకు సూచించారు.



## ఇంధన ఆదాపై మోదీ పిలుపు వేళ.. 50 కార్లతో భాజపా నేత ర్యాలీ

భోపాల్, మే 12: మధ్యప్రదేశ్‌లో ఒక భాజపా నేత వ్యవహరించిన తీరు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మధ్యప్రదేశ్ టెక్స్ట్‌బుక్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన సౌభాగ్యసింగ్ ఠాకూర్ ఆ బాధ్యతలు స్వీకరించేందుకు 50 కార్ల కాన్వాయ్‌తో తరలివెళ్లారు. తమ మద్దతుదారులతో కలసి ఉజ్జయిని నుంచి భోపాల్ వరకు ప్రయాణించారు. ఆ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. భాజపా నేత సౌభాగ్య తన నూతన పదవి బాధ్యతలు చేపట్టేందుకు భారీ కాన్వాయ్‌తో ఉజ్జయిని నుంచి బయల్దేరారు. హైవేపై మధ్యమధ్యలో మద్దతుదారులు ఆయనకు స్వాగతం పలికారు. అప్పుడు రోడ్డుపై కార్లు ఆపడంతో పలుచోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ ఇంధన ఆదాకు ప్రయత్నించాలంటూ దేశ ప్రజలకు ప్రధాని మోదీ పిలుపు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇలాంటి సమయంలో సౌభాగ్యసింగ్ ప్రవర్తించిన తీరు విమర్శలకు దారితీస్తోంది.

## అన్నాడీఎంకే రెబల్స్‌తో సీఎం విజయ్ భేటీ


చెన్నై, మే 12: తమిళనాడు శాసనసభలో సీఎం విజయ్ బలపరీక్షకు సిద్ధమవుతోన్న వేళ.. రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు ఉత్కంఠను కలిగిస్తున్నాయి. ఇప్పటికే అన్నాడీఎంకే పార్టీలో చీలిక ఏర్పడిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ పార్టీకి చెందిన రెబల్ ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి విజయ్ భేటీ కావడం చర్చనీయాంశమైంది. కాంగ్రెస్..తదితర మిత్రపక్షాల నేతలతో సమావేశమైన విజయ్.. అన్నాడీఎంకే సీనియర్ నేత సీవీ షణ్ముగం నివాసానికి వెళ్లారు. అక్కడ అన్నాడీఎంకే రెబల్స్ ఎమ్మెల్యేలతో ఆయన సమావేశమయ్యారు. అసెంబ్లీలో బుధవారం బలపరీక్ష జరగనున్న నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే పార్టీ 47 స్థానాల్లో విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఫలితాలు వెలువడిన తర్వాత ఈ పార్టీలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి తీరును సీనియర్ నేతలు సీవీ షణ్ముగం, ఎస్పీ వేలుమణి, సి.విజయభాస్కర్ తదితరులు బహిరంగంగానే విమర్శించారు. ఈ క్రమంలోనే గత శనివారం జరిగిన పార్టీ సమావేశంలో విజయ్ ముఖ్యమంత్రి అయ్యేందుకు మద్దతు తెలపటం, శాసనసభా కమిటీ నాయకత్వ బాధ్యతలపై వాడివేడి చర్చ జరిగింది. ఇందులో ఈపీఎస్ నిర్ణయాలతో విభేదించిన సీవీ షణ్ముగం, ఎస్పీ వేలుమణి సమావేశాన్ని బహిష్కరించారు. ఈ నేపథ్యంలోనే



పార్టీలో చీలిక ఏర్పడింది. తాము అన్నాడీఎంకే నుంచి బయటకు వచ్చి విజయ్‌కు మద్దతిస్తామని షణ్ముగం నేతృత్వంలోని రెబల్ ఎమ్మెల్యేలు ఈ ఉదయం ప్రకటించారు. దీంతో షణ్ముగం వర్గం అన్నాడీఎంకే ఎమ్మెల్యేలను తాజాగా విజయ్ కలిశారు.

## విజయ్‌కే మా మద్దతు: అన్నాడీఎంకేలో చీలిక..!

చెన్నై, మే 12: తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడైన దగ్గరి నుంచి అక్కడి రాజకీయాలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కూడా ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. కొన్ని రోజులుగా జరుగుతోన్న ప్రచారానికి తగ్గట్టే అన్నాడీఎంకే చీలిపోయింది. ఆ పార్టీ సీనియర్ నేత సీవీ షణ్ముగం నేతృత్వంలో కొందరు నేతలు అన్నాడీఎంకే నుంచి బయటకు వచ్చి, సీఎం విజయ్‌కు మద్దతు ప్రకటించారు. కొన్నేళ్లుగా అన్నాడీఎంకే చవిచూస్తోన్న ఓటములే ఈ మార్పునకు కారణమని షణ్ముగం వెల్లడించారు. "ఎన్నికల్లో విజయం సాధించిన టీవీకేకు మద్దతు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నాం. డీఎంకేకు వ్యతిరేకంగా అన్నాడీఎంకేను ఏర్పాటుచేశాం. 53 ఏళ్లుగా మా రాజకీయాలు ఆ దిశగానే కొనసాగాయి. కానీ డీఎంకే మద్దతుతో ఏఐఏడీఎంకే ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాలనే ప్రతిపాదన వచ్చింది. మెజార్టీ సభ్యులు దానిని తిరస్కరించారు. ఈ రెండు పార్టీలు పొత్తు పెట్టుకుంటే.. అన్నాడీఎంకే ఉనికే లేకుండాపోతుంది. ప్రస్తుతం మేం ఎలాంటి పొత్తులో లేము. ఇప్పుడు మా దృష్టి అంతా అన్నాడీఎంకేను పునరుద్ధరించి, బలోపేతం చేయడం పైనే ఉంది. చివరకు టీవీకేకు మద్దతు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నాం.




ఆ పార్టీనే ఎన్నికల్లో విజయం సాధించింది" అని వెల్లడించారు. తమకు అన్నాడీఎంకేను ముక్కలు చేసే ఉద్దేశం లేదని షణ్ముగం చెప్పారు. "ఇది చీలిక కాదు. పార్టీని ముందుకు తీసుకెళ్లే విషయంలో జనరల్ సెక్రటరీ (ఎడప్పాడి పళనిసామి) తీసుకునే సరైన నిర్ణయం కోసం వేచి చూస్తున్నాం" అని చెప్పారు. అలాగే భాజపాతో సంబంధాలు తెంచుకోవాలని తిరుగుబాటు గ్రూప్ ఆమోదించిన తీర్మానంలో ప్రస్తావించారు.

**తమిళనాడు స్పీకర్‌గా జేసీడీ ప్రభాకర్**

శాసన సభాపతి పదవి కి అధికార పార్టీ టీవీకే తరఫున జేసీడీ ప్రభాకర్ నామినేషన్ సమర్పించిన సంగతి తెలిసిందే. మంగళవారం ఆయన ఆ పదవికి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈయన థౌజండ్ లైట్స్ ఎమ్మెల్యే. మిగతా పార్టీలకు మెజారిటీ లేకపోవడంతో ఈ ఎన్నిక ఏకగ్రీవమైంది.

## టీసీఎస్ నాసిక్ కేసు.. నిదాఖాన్‌కు ఆశ్రయమిచ్చిన ఇల్లు కూల్చివేతకు నోటీసులు

నాసిక్/ఛత్రపతి శంభాజీనగర్ (ఔరంగాబాద్), మే 12: మహారాష్ట్రలో నాసిక్‌లోని టీసీఎస్ కార్యాలయంలో లైంగిక వేధింపులు, బలవంతపు మాతమార్పిళ్ల కేసులో ప్రధాన నిందితురాలు నిదాఖాన్ ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉంది. కేసు నమోదైన నాటినుంచి 25 రోజుల పాటు పరారీలో ఉన్న ఆమెకు ఆశ్రయమిచ్చిన ఏఐఎంఐఎం కార్పొరేటర్ ఇంటిని కూల్చివేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఔరంగాబాద్‌లోని ఏఐఎంఐఎం కార్పొరేటర్ మతిన్ పటేల్ నిందితురాలికి ఆశ్రమిచ్చినట్లు మున్సిపల్ కార్పొరేషన్ వెల్లడించింది. కార్పొరేటర్ తన ఇంటిని, కార్యాలయాన్ని గతంలో అక్రమంగా నిర్మించినట్లు గుర్తించామని అధికారులు వెల్లడించారు. ఈ విషయంపై స్పష్టతనివ్వాల్సిందిగా ఆయనకు నోటీసులు పంపామన్నారు. వాటికి సంతృప్తికర సమాధానం రాకపోతే ఆ రెండింటినీ కూల్చివేస్తామని మేయర్ సమీర్ రాజూర్‌కార్ వెల్లడించారు. అక్రమ నిర్మాణాలు చేపట్టినట్లు రుజువైతే మతిన్ పటేల్ తన కార్పొరేటర్ పదవిని కూడా కోల్పోయే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. నిదాఖాన్‌కు ఆశ్రయమివ్వాల్సిందిగా ఏఐఎంఐఎం నేత ఇంతియాజ్ జలీల్.. మతిన్ పటేల్‌పై ఒత్తిడి




తెచ్చినట్లు ఇటీవల మహారాష్ట్ర మంత్రి సంజయ్ ఆరోపించారు. ఆమెకు, ఆమె కుటుంబానికి ఆశ్రయం కల్పించిన వారిపై కూడా సిట్ దర్యాప్తు చేయాలని డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌కు లేఖ రాశారు. దీంతో పోలీసులకు నిదాఖాన్ ఆచూకీ లభ్యమయ్యింది. గురువారం రాత్రి ఛత్రపతి శంభాజీనగర్‌లోని కార్పొరేటర్ నివాసంలో పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు.




## పేపర్ లీక్ వ్యవహారం.. నీట్ పరీక్ష రద్దు

జాతీయ అర్హత పరీక్ష (నీట్ యూజీ2026)కు సంబంధించిన ప్రశ్నపత్రం రాజస్థాన్‌లో లీకైనట్లు వచ్చిన వార్తలు పెనుదుమారం రేపాయి. ఈ నేపథ్యంలో జాతీయ పరీక్ష సంస్థ (ఎన్‌టీఏ) కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా మే 3న జరిగిన నీట్ పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. త్వరలోనే కొత్త పరీక్ష తేదీలను వెల్లడిస్తామని తెలిపింది. విద్యార్థుల ప్రయోజనాలు, జాతీయ పరీక్షా వ్యవస్థపై ఉన్న విశ్వాసాన్ని కాపాడేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్‌టీఏ వెల్లడించింది. కొత్త పరీక్ష కోసం విద్యార్థులు మళ్లీ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదని, పరీక్ష ఫీజు చెల్లించనక్కర్లేదని తెలిపింది. పరీక్ష తేదీలను నిర్ణయించిన తర్వాత మళ్లీ అడ్మిట్ కార్డులు విడుదల చేస్తామని పేర్కొంది. ఇక, ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్‌టీఏ తెలిపింది. ఈనెల 3న జరిగిన నీట్ పరీక్షలో కెమిస్ట్రీ విభాగంలో వచ్చిన సుమారు 120కి పైగా ప్రశ్నలతో ఉన్న ఓ ప్రాక్టీసు పేపరును గుర్తించినట్లు రాజస్థాన్ అదనపు డీజీపీ విశాల్ బన్సాల్ వెల్లడించారు. ఈ మెటీరియల్ రాజస్థాన్‌లోని సికార్‌లో పరీక్షకు 42 గంటల ముందు వాట్సాప్‌లో అందుబాటులోకి వచ్చినట్లు గుర్తించారు. ఇందులోని సమాచారం.. నీట్ ప్రశ్నపత్రంలోని 600 మార్కుల ప్రశ్నలతో పోలి ఉండటం గమనార్హం. కొన్ని ప్రశ్నల్లోని జవాబుల క్రమం కూడా అచ్చం ఒకేలా ఉండడం పలు అనుమానాలకు తావిచ్చింది. ఆ ప్రాక్టీసు పేపరు కేరళలోని ఓ వైద్య కళాశాలలో చదువుతున్న ఎంబీబీఎస్ విద్యార్థికి చెందినదిగా దర్యాప్తులో వెల్లడైంది. ఆ వ్యక్తి ఈనెల 1న సికార్‌లోని తన స్నేహితుడికి ఈ మెటీరియల్ ఇచ్చాడని.. ఆ తర్వాత అది పీజీ వసతిగృహాలు, కోచింగ్ నెట్‌వర్క్‌లు, కెరీర్ కౌన్సిలర్లు, పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు చేరిందని అధికారులు తెలిపారు. ఆ మెటీరియల్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీకి సంబంధించిన 300కు పైగా చేతిరాత ప్రశ్నలు ఉన్నాయని వెల్లడించారు. దీనిని విద్యార్థులకు రూ.20వేల నుంచి రూ.2 లక్షల వరకు విక్రయించారని, కొందరు అభ్యర్థుల నుంచి ముందుగానే రూ.30 వేలకు పైగా వసూలుచేశారని గుర్తించామని రాజస్థాన్ పోలీసు అధికారులు పేర్కొన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి ఇప్పటికే పలువురు అనుమానితులను పోలీసులు అరెస్ట్ చేశారు.




## మావోయిస్టుల రహస్య స్థావరం.. రూ.1.64 కోట్ల నగదు స్వాధీనం

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో భద్రతా బలగాలు మావోయిస్టుల రహస్య స్థావరాన్ని గుర్తించాయి. 'మాద్ బచావో అభియాన్' కింద డీఆర్జీ, ఎస్‌టీఎఫ్, ఐటీబీపీ, బీఎస్ఎఫ్ సంయుక్తంగా చేపట్టిన ఈ ఆపరేషన్‌లో భారీగా నగదు, ఆయుధాలు, మందుగుండు సామగ్రి, నిత్యావసర వస్తువులను స్వాధీనం చేసుకున్నాయి. ఈ విషయాన్ని ఎస్పీ రాబిన్సన్ గుడియా ధ్రువీకరించారు. మొత్తం రూ.1.64 కోట్ల నగదు, మూడు ఏకే47 రైఫిళ్లు, మూడు ఎస్ఎల్ఆర్ రైఫిళ్లు, రెండు నాటు తుపాకులు సహా భారీగా ఇతర ఆయుధాలను భద్రతా సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు వందలాది తూటాలు, మ్యాగజైన్‌లు, ఎలక్ట్రానిక్ డిటోనేటర్లు, కార్డెక్స్ వైర్, వాకీటాకీ సెట్లు ఉన్నాయి. జిల్లాను మావోయిస్టు రహితంగా మార్చేందుకు ఇలాంటి ఆపరేషన్లు భవిష్యత్తులో కూడా కొనసాగుతాయని ఎస్పీ తెలిపారు.

## స్పీకర్ పోస్ట్‌పై విజయ్ స్టోరీ: అసెంబ్లీలో తొలి ప్రసంగమే వైరల్

తమిళనాడు శాసనసభ స్పీకర్ ఎన్నిక సమయంలో ఆసక్తికర సన్నివేశం జరిగింది. సీఎం విజయ్ (CM Vijay) స్పీకర్ ఎన్నిక వెనక స్టోరీని చెప్పి నవ్వులు పూయించారు. శాసనసభలో తన తొలి ప్రసంగంతోనే అందరినీ ఆకట్టుకున్నారు. థౌజండ్‌లైట్స్ నియోజకవర్గం నుంచి ఎన్నికైన జేసీడీ ప్రభాకర్ (JCD Pra bhakar) మంగళవారం స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నియ్యారు. ఆయన్ను శాసనసభలో ప్రతిపక్ష నేతగా ఉన్న ఉదయనిధి స్టాలిన్ సభాపతి స్థానం వద్దకు తీసుకువచ్చారు. అలా కూర్చోబెట్టడం వెనక కథను విజయ్ సరదాగా వివరించారు. "భారతదేశం అనుసరిస్తోన్న పార్లమెంటరీ సంప్రదాయాలలో ఎక్కువగా బ్రిటన్ నుంచి తీసుకున్నవే. తొలినాళ్లలో బ్రిటన్‌లో స్పీకర్ పదవిని అత్యంత ప్రమాదకరంగా భావించేవారు. ఎందుకంటే పార్లమెంట్ తీసుకున్న నిర్ణయాలను చక్రవర్తికి చేరవేయాల్సిన బాధ్యత స్పీకర్‌దే. అలాగే రాజు ప్రతిపాదనలను పార్లమెంట్ తిరస్కరించినా.. ఆ విషయాన్ని చెప్పే బాధ్యత



కూడా ఆ కుర్చీలో కూర్చున్నవారిదే. ఆ ప్రక్రియ అంతా తనకు వ్యతిరేకంగా, పక్షపాతంతో ఉందని రాజు భావిస్తే.. ఆ స్పీకర్‌కు శిక్ష తీవ్రంగా ఉండేదట. ఒక్కోసారి మరణశిక్ష సైతం పడవచ్చు. అందుకే ఎవరూ ఆ పదవిని స్వీకరించేందుకు ముందుకు వచ్చేవారు కాదు (నవ్వుతూ మాట్లాడారు). దాంతో ఆ ప్రమాదకరమైన పదవికి ఎన్నికైన వ్యక్తిని బలవంతంగా ఆ ఛైర్‌లో కూర్చోబెట్టేవారు. అదే సంప్రదాయం ఇప్పటికీ కొనసాగుతోంది" అని ఆ కథ చెప్పుకొచ్చారు. నేడు తమిళనాడు అసెంబ్లీలో స్పీకర్‌ను ఛైర్ వద్దకు తోడ్కొని వెళ్లే బాధ్యతను ఉదయనిధి స్టాలిన్‌పై పెట్టారు. తమిళనాడు శాసనసభ కార్యకలాపాలు ప్రజాస్వామ్యానికి కేంద్రబిందువుగా ఉండాలని తన తొలి ప్రసంగంలో విజయ్ ఆశించారు. అయితే సీఎం చెప్పిన స్టోరీ ఇప్పుడు నెట్టింట్లో వైరల్ అవుతోంది. అది నిజమా..? అంటూ నెటిజన్లు ఆరా తీయడం మొదలుపెట్టారు.


# రెండో రోజూ కుప్పకూలిన మార్కెట్లు

పశ్చిమాసియా ఉద్రిక్తతలు, క్రూడ్ ఆయిల్ ధరల పెరుగుదలతో అమ్మకాల ఒత్తిడి

1,456 పాయింట్లు పతనమైన సెన్సెక్స్, 436 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ

ప్రధాని మోదీ వ్యాఖ్యలతో ఇన్వెస్టర్లలో పెరిగిన ఆందోళన

ఐటీ, రియల్టీ షేర్లలో భారీ అమ్మకాలు



**ముంబై:** భారత స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ నష్టాలను చవిచూశాయి. వరుసగా రెండో సెషన్‌లో కూడా అమ్మకాల సునామీ కొనసాగింది. పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు, అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు భగ్గుమనడంతో ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గుచూపారు. ఫలితంగా అన్ని రంగాల షేర్లలోనూ తీవ్రమైన అమ్మకాల ఒత్తిడి కనిపించింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 1,456.04 పాయింట్లు పతనమై 74,559.24 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 436.3 పాయింట్లు నష్టపోయి 23,379.55 వద్ద ముగిసింది. పెరుగుతున్న భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో ఇంధన వినియోగం, విదేశీ ప్రయాణాలు, బంగారం కొనుగోళ్లు తగ్గించుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు పిలుపునివ్వడం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను మరింత బలహీనపరిచింది. ఈ వ్యాఖ్యలతో పశ్చిమాసియా సంక్షోభం భారత ఆర్థిక వ్యవస్థపై విస్తృత ప్రభావం చూపుతుందనే భయాలు తీవ్రమయ్యాయి.

బ్రాడర్ మార్కెట్‌లో నష్టాలు మరింత ఎక్కువగా ఉన్నాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 2.54 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 3.17 శాతం మేర పతనమయ్యాయి. రంగాల వారీగా చూస్తే ఐటీ, రియల్టీ షేర్లు అత్యధికంగా నష్టపోయాయి. టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్, టైటాన్, టీసీఎస్ వంటి షేర్లు 4.44 శాతం వరకు నష్టపోయాయి. సెన్సెక్స్ 30 షేర్లలో ఎస్‌బీఐ మాత్రమే లాభాల్లో ముగియడం గమనార్హం.

సాంకేతిక విశ్లేషకుల ప్రకారం, నిఫ్టీకి తక్షణ మద్దతు 23,300 వద్ద, ఆ తర్వాత 23,100 వద్ద ఉందని చెబుతున్నారు. ఎగువ స్థాయిలో 23,500 తక్షణ నిరోధకంగా మారింది. క్రూడ్ ఆయిల్ ధరలు, భౌగోళిక రాజకీయ అనిశ్చితుల కారణంగా సమీప భవిష్యత్తులో మార్కెట్లలో ఒడిదుడుకులు కొనసాగవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే, పటిష్ఠమైన దేశీయ ఆర్థిక మూలాలు మార్కెట్లకు మద్దతుగా నిలుస్తాయని వారు అభిప్రాయపడుతున్నారు.

# ప్రపంచవ్యాప్తంగా నిలిచిపోయిన గూగుల్ సెర్చ్..

భారత్‌లోనూ యూజర్ల ఇబ్బందులు

భారత్, అమెరికా సహా పలు దేశాల్లో యూజర్ల ఇబ్బందులు

'500 ఇంటర్నల్ సర్వర్ ఎర్రర్' కారణంగా సమస్య

సమస్యను పరిష్కరిస్తున్నామన్న గూగుల్ ఇంజినీర్లు



**న్యూఢిల్లీ:** టెక్ దిగ్గజం ఆల్ఫాబెట్ ఇంక్‌కు చెందిన గూగుల్ సెర్చ్ సేవలు మంగళవారం ఉదయం ప్రపంచవ్యాప్తంగా నిలిచిపోయాయి. భారత్, అమెరికా సహా పలు దేశాల్లోని వినియోగదారులు గూగుల్ సెర్చ్‌ను యాక్సెస్ చేయడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చాలామందికి సెర్చ్ పేజీ ఓపెన్ కాలేదు.

సెర్చ్ చేయడానికి ప్రయత్నించిన అనేక మంది యూజర్లకు '500 ఇంటర్నల్ సర్వర్ ఎర్రర్' అనే సందేశం కనిపించింది. 'మీ అభ్యర్థనను ప్రాసెస్ చేస్తున్నప్పుడు అంతర్గత సర్వర్ లోపం తలెత్తింది. మా ఇంజినీర్లకు సమాచారం అందింది, వారు సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తున్నారు. దయచేసి మళ్లీ ప్రయత్నించండి' అని ఆ సందేశంలో ఉంది. సాధారణంగా ఈ ఎర్రర్, యూజర్ల డివైజ్‌లు లేదా ఇంటర్నెట్ కనెక్షన్‌లో కాకుండా, కంపెనీ సర్వర్ల వైపు సమస్య ఉన్నప్పుడు కనిపిస్తుంది.

ఈ అంతరాయంతో సోషల్ మీడియాలో, ఆన్‌లైన్ ఔటేజ్-ట్రాకింగ్ ప్లాట్‌ఫామ్‌లలో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. కేవలం భారత్ నుంచే స్వల్ప వ్యవధిలో వందల సంఖ్యలో రిపోర్టులు నమోదయ్యాయి. ఈ సమస్య కారణంగా కొంతమంది యూజర్లు సెర్చ్ ఫలితాలను చూడలేకపోయారు.

ఇటీవలి కాలంలో పలు టెక్నాలజీ ప్లాట్‌ఫామ్‌లు అంతరాయాలకు గురవడం గమనార్హం. ఈ ఏడాది మార్చిలో చైనాకు చెందిన ఏఐ చాట్‌బాట్ డీప్‌సీక్ ఏడు గంటలకు పైగా ఆఫ్‌లైన్‌లో ఉండిపోయింది. అదే నెలలో, ఇన్‌స్టాగ్రామ్ యూజర్లు కూడా డైరెక్ట్ మెసేజ్‌ల విషయంలో సమస్యలు ఎదుర్కొన్నారు. ఫిబ్రవరిలో యూట్యూబ్ సేవలు కూడా ప్రపంచవ్యాప్తంగా నిలిచిపోయిన విషయం తెలిసిందే.

# వీరందరికీ ఎల్పీజీ గ్యాస్ సబ్సిడీ కట్

రూ. 10 లక్షల వార్షిక ఆదాయం దాటిన వారికి సబ్సిడీ కట్

పాన్ కార్డు డేటా ఆధారంగా ఐటీ రికార్డులను తనిఖీ చేస్తున్న వైనం

అనర్హులుగా తేలిన వారికి మెసేజ్ లు పంపిస్తున్న ఆయిల్ కంపెనీలు



**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం ఎల్పీజీ గ్యాస్ సబ్సిడీ విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. వార్షిక ఆదాయం రూ. 10 లక్షలు దాటిన కుటుంబాలకు సబ్సిడీ రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. ఇది 2015 నుంచి ఉన్న రూలే అయినప్పటికీ, ఇప్పటివరకు వినియోగదారుల వ్యక్తిగత డిక్లరేషన్‌పై ఆధారపడేవారు. కానీ ఇప్పుడు నేరుగా పాన్ కార్డ్ డేటా ఆధారంగా ఐటీ రికార్డులను తనిఖీ చేస్తున్నారు.

ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే, కేవలం కనెక్షన్ ఉన్న వ్యక్తి ఆదాయమే కాదు.. భార్యాభర్తల్లో ఎవరి ఆదాయం రూ. 10 లక్షలు దాటినా ఆ కుటుంబం సబ్సిడీకి అనర్హమవుతుంది. ఇప్పటికే ఐటీ రికార్డుల ప్రకారం అనర్హులుగా తేలిన వారికి ఆయిల్ కంపెనీలు మెసేజ్‌లు పంపిస్తున్నాయి. 7 రోజుల్లోగా అభ్యంతరాలు తెలపకపోతే ఆటోమేటిక్‌గా సబ్సిడీ కట్ అయిపోతుంది.

ఈ నిబంధనల వల్ల సామాన్యులకు లేదా పేదలకు ఎలాంటి ఇబ్బంది లేదు. ముఖ్యంగా 'ప్రధానమంత్రి ఉజ్వల యోజన' లబ్ధిదారులకు ఈ రూల్ వర్తించదు. వారికి వచ్చే సబ్సిడీ యథావిధిగా అందుతుంది.

## మోదీ స్టేడియంలో సన్‌రైజర్స్

# ఘోరపరాజయం...

86 పరుగులకే ఆలౌట్

సన్‌రైజర్స్‌పై 82 పరుగుల తేడాతో గుజరాత్ ఘన విజయం

169 పరుగుల లక్ష్య ఛేదనలో స్వల్ప స్కోరుకే కుప్పకూలిన హైదరాబాద్

రాణించిన గుజరాత్ బౌలర్లు.. రబడా, హోల్డర్‌లకు మూడేసి వికెట్లు



**అహ్మదాబాద్:** అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను 82 పరుగుల భారీ తేడాతో చిత్తుగా ఓడించింది. 169 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన హైదరాబాద్.. గుజరాత్ బౌలర్ల ధాటికి 14.5 ఓవర్లలో కేవలం 86 పరుగులకే కుప్పకూలింది.

ఛేదనలో సన్‌రైజర్స్ ఆది నుంచే వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఓపెనర్ ట్రావిస్ హెడ్ డకౌట్‌గా వెనుదిరగడంతో మొదలైన పతనం ఏ దశలోనూ ఆగలేదు. కగిసో రబడా (3/28), జాసన్ హోల్డర్ (3/20) నిప్పులు చెరిగే బంతులతో హైదరాబాద్ బ్యాటింగ్ లైనప్‌ను కుప్పకూల్చారు. ప్రసిద్ధ్ కృష్ణ రెండు వికెట్లు తీయగా, సిరాజ్ ఒక వికెట్ పడగొట్టాడు. హైదరాబాద్ జట్టులో కెప్టెన్ పాట్ కమిన్స్ (19) టాప్ స్కోరర్‌గా నిలిచాడు.

అంతకుముందు, టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసింది. సాయి సుదర్శన్ (44 బంతుల్లో 61), వాషింగ్టన్ సుందర్ (33 బంతుల్లో 50) అద్భుతమైన హాఫ్ సెంచరీలతో జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించారు. ఆరంభంలో కెప్టెన్ గిల్ సహా కీలక వికెట్లు త్వరగా కోల్పోయినా, వీరిద్దరి భాగస్వామ్యాలు గుజరాత్‌ను ఆదుకున్నాయి. హైదరాబాద్ బౌలర్లలో ప్రఫుల్ హింగే, సాకిబ్ హుస్సేన్ రెండేసి వికెట్లు తీశారు.

మొత్తంగా బౌలింగ్, బ్యాటింగ్ విభాగాల్లో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన గుజరాత్ ఈ సీజన్‌లో మరో కీలక విజయాన్ని నమోదు చేసుకుంది.

# మాజీ ఛాంపియన్‌కు వైల్డ్ కార్డ్..

టాప్ సీడ్స్‌కు తిప్పలేనా..!



**న్యూఢిల్లీ:** మట్టికోర్టు పోరాటాలకు నెలవైన ఫ్రెంచ్ ఓపెన్‌కు మరో ఆరు రోజులే ఉంది. ఇప్పటికే టాప్ సీడ్స్ జన్నిక్ సిన్నర్, జ్వెరెవ్, స్వియాటెక్‌లు తమవైన వ్యూహాలతో బిజీగా ఉండగా.. టోర్నీని మరింత ఆసక్తిగా మార్చేందుకు నిర్వాహకులు వైల్డ్ కార్డ్ ఎంట్రీలు ఖరారు చేశారు. మాజీ ఛాంపియన్ స్టాన్ వావ్రింకా, ఒకప్పటి సెమీస్ ఆడిన గేల్ మోన్‌ఫిల్స్‌కు ఆడే అవకాశమిచ్చింది. మహిళల విభాగంలో ఎనిమిది మంది వైల్డ్ కార్డ్ ఎంట్రీతో ఫ్రెంచ్ ఓపెన్ ఆడనున్నారు.

రొలాండ్ గరోస్ టోర్నమెంట్‌కు వైల్డ్ కార్డ్ ఎంట్రీ సాధించిన వెటరన్ వావ్రింకా ప్రస్తుతం 125వ ర్యాంక్. కానీ, ఈ ఈవెంట్లో అతడు గుర్తుండిపోయే ప్రదర్శనలు చేసిందుకు ఈసారి నిర్వాహకులు అవకాశమిచ్చారు. 2015లో క్వార్టర్స్‌లో రోజర్ ఫెదరర్‌ను ఓడించిన ఉత్సాహంతో.. ఫైనల్లో నొవాక్ జకోవిచ్‌ను చిత్తు చేసి టైటిల్ కొల్లగొట్టాడీ స్విట్జర్లాండ్ స్టార్. గేల్ విషయానికొస్తే.. ఈ ఫ్రెంచ్ ఆటగాడు 2008లో సెమీస్ వరకూ వెళ్లాడు. కానీ, ఫెదరర్ జోరుకు నిలవలేక చేతులెత్తేశాడు.

వావ్రింకా, గేల్‌తో పాటు పురుషుల విభాగంలో, మహిళల విభాగలో పలువురు వైల్డ్ కార్డ్ ఎంట్రీ దక్కించుకున్నారు. పురుషుల వైల్డ్ కార్డ్ జాబితాలో.. నిశేష్ బసవరెడ్డి, టిటౌన్ డ్రొగుట్, హుగో గస్టన్, అర్థర్ జీ, మోయిస్ కౌమె, ఆడమ్ వాల్టన్ ఉన్నారు. మహిళల విభాగంలో క్లారా బురెల్, సెనియా ఎఫ్రెమొవా, ఫియోనా ఫెర్రో, లియోలియా జీన్‌జీన్, ఎమెర్సన్ జోన్స్, సరాహ్ రకొటొమంగ, అలిసే తుబెల్లో, ఆకాశ ఉర్హోబోలు వైల్డ్ కార్డ్ ఎంట్రీ సాధించారు.

**టాప్ సీడ్స్‌గా**

పురుషుల సింగిల్స్‌లో జనిక్ సిన్నర్, అలెగ్జాండర్ జ్వెరెవ్, నొవాక్ జకోవిచ్, ఫెలిక్స్ అగర్ అలిస్సిమెలు టాప్ సీడ్స్‌గా పోటీ పడుతున్నారు. మహిళల విభాగంలో ఇగా స్వియాటెక్, ఎలెనా రిబాకీనాలు టైటిల్ లక్ష్యంగా ఆడనున్నారు. మే 18 నుంచి జూన్ 7 వరకూ ఫ్రెంచ్ ఓపెన్ జరుగనుంది.

# సవాల్ విసిరి చతికిలబడిన పాకిస్థాన్..

తొలి విజయంతో చరిత్ర సృష్టించిన బంగ్లాదేశ్..!



**న్యూఢిల్లీ:** సొంతగడ్డపై తామెంత ప్రమాదకరమో బంగ్లాదేశ్ (దీుఅస్త్రశ్రీఖఁవంష్ట్ర) జట్టు మరోసారి నిరూపించింది. తొలి టెస్టులో పాకిస్థాన్ బ్యాటర్లను వణకిస్తూ భారీ విజయాన్నందుకుంది. 'దమ్ముంటే మా ముందు దమ్ముంటే మా ముందు 70 ఓవర్లలో 260పైగా లక్ష్యాన్ని నిర్దేశించండి' అని సవాల్ విసిరిన సల్మాన్ అఘా తల పొగరను అణచివేస్తూ రెండు టెస్టుల సిరీస్‌లో ఆధిక్యంలోకి వెళ్లింది. మొదటి ఇన్నింగ్స్‌లో కాస్తో కూస్తో పోరాడిన పాక్.. రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం కుప్పకూలింది. నహిద్ రానా (5-40) బంతితో చెలరేగిన వేళ బంగ్లా 104 పరుగుల తేడాతో గెలుపొందింది. తద్వారా స్వదేశంలో పాక్‌పై బంగ్లాదేశ్ మొదటి విజయంతో చరిత్ర సృష్టించింది.

ఢాకా టెస్టులో ఆతిథ్య బంగ్లాదేశ్ ధాటికి పాకిస్థాన్ నిలువలేకపోయింది. 268 పరుగుల స్వల్ప ఛేదనలో బ్యాటర్ల వైఫల్యంతో పాక్ కుప్పకూలింది. రెండో ఇన్నింగ్స్‌లో నహిద్ రానా(5-40) ఐదు వికెట్లతో బంగ్లాదేశ్ విజయంలో కీలకమయ్యాడు. మొదటి ఇన్నింగ్స్‌లో పట్టుదలగా ఆడిన పాక్ ఆటగాళ్లు ఏమొందో ఏమో రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం తేలిపోయారు.

టాపార్డర్, మిడిలార్డర్ విఫలమైన చోట అబ్దుల్లా ఫజల్(66) ఒక్కడే అర్ధ శతకంతో పోరాడాడు. కానీ, నహిద్ సంచలన స్పెల్‌తో పాక్ పతనాన్ని శాసించాడు. తొలి ఇన్నింగ్స్ శతకంతో.. రెండో ఇన్నింగ్స్‌లో హాఫ్ సెంచరీతో మెరిసిన బంగ్లా కెప్టెన్ శాంటో ' ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికయ్యాడు.

**శాంటో సెంచరీ..**

తొలి ఇన్నింగ్స్‌లో పాక్ బౌలర్లను సమర్ధంగా ఎదుర్కొన్న నజ్ముల్ హుసేన్ శాంటో(103) సెంచరీతో కదం తొక్కాడు. సీనియర్ బ్యాటర్ ముష్ఫికర్ రహీం(71) మెరుపులతో బంగ్లాదేశ్ భారీ స్కోర్ దిశగా సాగింది. కానీ, మొహమ్మద్ అబ్బాస్(92-5) ఐదు వికెట్లు తీసి బంగ్లాను 413కే పరిమితం చేశాడు. అనంతరం ఇన్నింగ్స్ ఆరంభించిన పాక్ కూడా దీటుగానే బదులిచ్చింది.

ఓపెనర్ అజాన్ అవైస్(103), అబ్దుల్లా ఫజల్(87), సల్మాన్ అఘా(58), మహమ్మద్ రిజ్వాన్(59)లు అర్ధ శతకాతో రాణించినా.. మెహిదీ హసన్ మిరాజ్(5-102) ధాటికి 386కే ఆలౌటయ్యింది. రెండో ఇన్నింగ్స్‌లో శాంటో అర్ధ శతకంతో ఆదుకోగా బంగ్లా 9 వికెట్ల నష్టానికి 240 పరుగులు చేసింది. ఇరుజట్ల మధ్య మే 16 నుంచి రెండో టెస్టు జరుగనుంది.

## కలల కప్ కోసం పకడ్బందీగా..

# ఆల్‌రౌండర్లతో సఫారీ స్క్వాడ్..!

**దక్షిణాఫ్రికా:** మహిళల టీ20 ప్రపంచకప్ సమీపిస్తుండడంతో దక్షిణాఫ్రికా బోర్డు స్క్వాడ్‌ను ప్రకటించింది. గత సీజన్‌లో రన్నరప్‌తోనే సరిపెట్టుకున్నా.. ఈసారి టైటిల్ లక్ష్యంగా మంగళవారం లారా వొల్వార్డ్ కెప్టెన్‌గా పటిష్టమైన బృందాన్ని ఎంపిక చేసింది. పొట్టి ఫార్మాట్‌లో రాణిస్తున్న15 మందికి చోటు దక్కగా.. వీరిలో సీనియర్ పేసర్ షబ్నిం ఇస్మాయిల్ కూడా ఉంది. వరల్డ్‌కప్ కోసం వీడ్కోలు వెనక్కి తీసుకున్న ఆమె మెగా ఈవెంట్‌లో సఫారీ పేస్ దళాన్ని నడిపించనుంది.

అందని ద్రాక్షలా ఊరిస్తున్న ఐసీసీ ట్రోఫీని పట్టేసేందుకు దక్షిణాఫ్రికా సిద్ధమవుతోంది. నిరుడు భారత గడ్డపై వన్డే ప్రపంచకప్‌లో అదిరే ఆటతో ఫైనల్ చేరినా.. అనూహ్యంగా తడబడిన సఫారీ సైన్యం.. ఈసారి టైటిల్ లక్ష్యంగా స్క్వాడ్‌ను ఎంపిక చేసింది. అనుభవజ్ఞురాలైన లారా వొల్వార్డ్ కెప్టెన్సీలో పొట్టి ప్రపంచకప్‌ను తన్నుకుపోవడానికి వస్తోంది. వన్డే ప్రపంచకప్ ఆడిన చాలామందికి పొట్టి కప్ ఆడబోతున్నారు. కానీ, గత సీజన్‌లో సఫారీ టీమ్ ఫైనల్ చేరడంలో కీలకమైన అనెకే బాష్ మాత్రం ఈ ఎడిషన్‌కు ఎంపికవ్వలేదు.

టాపార్డర్ బ్యాటర్లుగా తంజిమ్ బ్రిట్స్, డెర్క్‌సెన్, సునే లుస్ ఎంపికవ్వగా.. ఆల్‌రౌండర్లుగా మరినే కాప్, డీక్లర్క్, చోలే ట్రయాన్‌లు చోటు సంపాదించారు. అండర్-19 కెప్టెన్ కైలా రెయ్‌న్కే తొలిసారి జాతీయ జట్టుకు ఆడనుండగా.. మూడేళ్ల క్రితం చివరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడిన షబ్నం ఇస్మాయిల్ యూటర్న్ తీసుకోవడంతో స్క్వాడ్‌లోకి వచ్చింది. ఇంగ్లండ్ వేదికగా జరిగే పొట్టి సంగ్రామంలో తను మరినే కాప్, డానే వాన్ నీకెర్క్, ఖాకతో కలిసి కొత్త బంతిని పంచుకోనుంది.



దక్షిణాఫ్రికా ప్రపంచకప్ స్క్వాడ్ : లారా వొల్వార్డ్(కెప్టెన్), తంజిమ్ బ్రిట్స్, నడినే డీక్లెర్క్, అనెరీ డెర్క్‌సెన్, సినాలో జఫ్తా(వికెట్ కీపర్), మరినే కాప్, సునే లుస్, కరాబొ మెసో(వికెట్ కీపర్), నొనుకులులెకో మలబా, కైలా రెయ్‌నకే, తుమి సెఖునే, చొలే ట్రయాన్, డాన్ వాన్ నీకెర్క్, షబ్నిం ఇస్మాయిల్, అయబొంగ ఖాకా.

# విడాకుల జాబితాలో మరో నటి


## భర్తను అన్ ఫాలో చేసిన మౌనీరాయ్



**టాకీస్:** నటి మౌనీరాయ్ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఒక వార్త కొన్ని రోజులుగా నెట్టింట వైరల్ అవుతోంది. భర్త సూరజ్ నంబియార్‌తో ఆమె విడిపోతున్నట్లు నెట్టింట ప్రచారం జరుగుతోంది. తాజాగా ఈ వార్తలకు బలం చేకూర్చేలా ఇన్‌స్టాగ్రామ్‌లో వీరిద్దరూ ఒకరికొకరు అన్‌ఫాలో చేసుకున్నారు. ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే మౌనీ రాయ్ తనకు సంబంధించిన విషయాలను పంచుకుంటూ టూర్స్ ఫొటోలను షేర్ చేస్తుంటారు. కొన్ని రోజులుగా భర్తతో ఉన్న ఫొటోలు పోస్ట్ చేయలేదు. మరోవైపు సూరజ్ నంబియార్ ఇన్‌స్టాలో పెళ్లి ఫొటోలు కూడా కనిపించడం లేదు. అలాగే రూమర్స్‌ను ఇద్దరూ ఖండించకపోవడంతో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. 2022 జనవరిలో తన ప్రియుడు సూరజ్ నంబియార్‌ను మౌనీరాయ్ గోవాలో వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. సినిమాల విషయానికొస్తే.. మౌనీరాయ్ 'విశ్వంభర'లో ఓ స్పెషల్ సాంగ్ చేసినట్లు సమాచారం. చిరంజీవి హీరోగా వశిష్ఠ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. చిరంజీవి సూపర్ హిట్ సినిమా 'ఖైదీ'లోని రగులుతోంది మొగలిపొద.. పాట రీమేక్‌కు మౌనీరాయ్‌తో కలిసి చిరు మరోసారి మెస్మరైజ్ చేయనున్నట్లు తెలుస్తోంది.

## శ్రీనివాస మంగాపురం

# సెకండ్ సింగిల్ ప్రోమో




**టాకీస్:** మంగళవారం సినిమా హిట్ తరువాత అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తోన్న చిత్రాల్లో శ్రీనివాస మంగాపురం ఒకటి. ఘట్టమనేని వారసుడు జయకృష్ణ హీరోగా పరిచయమవుతోన్న ఈ చిత్రంలో బాలీవుడ్ భామ రవీనా టాండన్ కుమార్తె రషా తడానీ హీరోయిన్ గా నటిస్తోంది. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, సాంగ్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సినిమాను వైజయంతీ మూవీస్ బ్యానర్ పై అశ్వినీదత్ సమర్పించడం మరింత బజ్ ని క్రియేట్ చేసింది. తాజాగా శ్రీనివాస మంగాపురం నుంచి సెకండ్ సింగిల్ ప్రోమోను మేకర్స్ రిలీజ్ చేశారు. మంగా మంగా అంటూ సాగే ఈ సాంగ్ ఆద్యంతం ఆకట్టు కొంటుంది. తిరుపతిలో జరిగే ప్రేమకథగా శ్రీనివాస మంగాపురం తెరకెక్కుతోంది. కొత్తగా తిరుపతి కొచ్చిన కుర్రోళ్ళని బతకనివ్వరా..? అన్నదమ్ములు లేరా మీకు? అంటూ హీరో.. హీరోయిన్ అందాన్ని చూసి మైమరచిపోయి.. ఆమెపై ఉన్న ప్రేమ భావాలను తెలిపుతున్నట్లు లిరిక్స్ వింటుంటే అర్థమవుతోంది.

# కమల్-రజనీ మూవీలో త్రిష



**టాకీస్:** తమిళనాడులో ఎన్నికల సందడి మొదలు... గత కొన్ని రోజులుగా త్రిష పేరు మార్మోగిపోతోంది. ముఖ్యమంత్రిగా తమిళ సూపర్‌స్టార్ విజయ్ ప్రమాణ స్వీకారోత్సవంలోనూ త్రిష ప్రధాన ఆకర్షణగా నిలిచారు. తమిళనాడు రాజకీయాల్లోకి ఆమె కూడా ప్రవేశిస్తారన్న ప్రచారం సామాజిక మాధ్యమాల్లో మొదలైంది. అయితే ఆమె వరుస సినిమాలతో సందడి చేయబోతోంది. మరోవైపు కొత్త ప్రాజెక్టుల విషయంలోనూ ఆమె పేరు బలంగా వినిపిస్తోంది. రజనీకాంత్, కమల్‌హాసన్ కలిసి చేయనున్న సినిమాలోనూ త్రిష కథానాయికగా నటించనున్నట్టు సమాచారం. నాలుగున్నర దశాబ్దాల తర్వాత రజనీకాంత్, కమల్‌హాసన్ కలిసి ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆ సినిమాలోనే త్రిష ఓ కథానాయికగా నటించనున్నట్టు తెలుస్తోంది. అదే నిజమైతే ఈ కలయిక మరింత ప్రత్యేకం కానుంది. దీనిపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన అనంతరం ఇన్‌స్టాలో ఓ పోస్ట్‌ని పంచుకున్నారు త్రిష. ప్రేమ ఎప్పుడూ గట్టిగానే వినిపిస్తుంది... అనే వ్యాఖ్యని జోడిస్తూ, తన ముస్తాబు వెనకున్న తన బృందానికి కృతజ్ఞతలు చెప్పింది.



# పెళ్లి తర్వాత మరింత అందంగా మెహ్రీన్..

## రాయల్ లుక్‌తో సోషల్ మీడియాలో సందడి

టాకీస్: టాలీవుడ్‌లో తన అందం, నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మెహ్రీన్ పీర్జాదా ఇప్పుడు కొత్త జీవితాన్ని ఆస్వాదిస్తోంది. ఇటీవల అర్ష్ ఔలఖ్‌ను వివాహం చేసుకున్న ఈ ముద్దుగుమ్మ, తాజాగా తన వివాహ వేడుక అనంతరం జరిగిన ప్రత్యేక వేడుకకు సంబంధించిన ఫొటోలను అభిమానులతో పంచుకుంది. ఈ చిత్రాల్లో మెహ్రీన్ కనిపించిన తీరు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో హాట్ టాపిక్‌గా మారింది."నక్షత్రాల్లో రాసిన రాత్రి" అంటూ మెహ్రీన్ తన భర్త అర్ష్‌తో కలిసి దిగిన ఫొటోలను పంచుకుంది. ఈ ఫొటోల్లో ఆమె ధరించిన ప్రత్యేకమైన దుస్తులు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. షాంపేన్ రంగులో రూపొందించిన ప్రత్యేక లెహంగా, దానిపై చేసిన నాజూకైన చేతిపని ఎంబ్రాయిడరీ ఆమెకు మరింత రాయల్ లుక్‌ను తీసుకొచ్చాయి. ఈ ప్రత్యేక దుస్తులను ప్రముఖ పాకిస్థానీ డిజైనర్ రూపొందించినట్లు సమాచారం. లెహంగా పైభాగంలో జాకెట్ తరహాలో రూపొందించిన కేప్, దానికి సరిపోయే ఆభరణాలు మెహ్రీన్‌ను నిజంగానే ఓ యువరాణిలా చూపించాయి. ఆమె ధరించిన నగలు, మేకప్, హెయిర్ స్టైల్ అన్నీ కలిపి ఒక రాజసమైన పెళ్లి వేడుకను గుర్తు చేస్తున్నాయి. హిమాచల్ ప్రదేశ్‌లోని అందమైన ప్రాంతాల్లో ఏప్రిల్ 26న వీరి వివాహం అత్యంత వైభవంగా జరిగినట్లు తెలుస్తోంది. కుటుంబ సభ్యులు, సన్నిహితులు, స్నేహితుల సమక్షంలో జరిగిన ఈ వేడుకకు సంబంధించిన ఫోటోలు ఇప్పుడు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. సినిమాల విషయానికి వస్తే, నాని హీరోగా నటించిన 'కృష్ణగాడి వీర ప్రేమ గాథ' సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన మెహ్రీన్, చాలా తక్కువ సమయంలోనే స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. 'మహానుభావుడు', 'రాజా ది గ్రేట్', 'ఎఫ్ 2' వంటి చిత్రాలతో ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాదించింది. ముఖ్యంగా "హనీ ఈజ్ బెస్ట్" అనే డైలాగ్‌తో ఆమెకు ప్రత్యేక గుర్తింపు వచ్చింది. ఇప్పుడు పెళ్లి తర్వాత కూడా మెహ్రీన్ అదే అందం, హుందాతనంతో అభిమానులను ఆకట్టుకుంటోంది. ఆమె తాజా ఫోటోలను చూసిన అభిమానులు "చాలా అందంగా ఉన్నావు", "రియల్ ప్రిన్సెస్‌లా కనిపిస్తున్నావు" అంటూ కామెంట్లు చేస్తున్నారు.

MOVIE TIME

# ఎన్టీఆర్-నీల్ ప్రాజెక్ట్ మూవీ


## మే19న అర్ధరాత్రి గ్లింప్స్ విడుదల



**టాకీస్:** జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఎన్టీఆర్-నీల్' ప్రాజెక్ట్ నుంచి అదిరిపోయే అప్డేట్ రాబోతోంది. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌పై ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా కెజిఎఫ్, 'సలార్' సినిమాలతో తనకంటూ ప్రత్యేకమైన మాస్ యూనివర్స్‌ను సృష్టించిన ప్రశాంత్ నీల్, ఇప్పుడు తారక్‌ను ఎలా చూపించబోతున్నాడోననే ఆసక్తి అభిమానుల్లో రోజురోజుకీ పెరుగుతోంది. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ గ్లింప్స్‌ను తారక్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. దీంతో మే 20న అభిమానులకు భారీ ట్రీట్ ఖాయమని అందరూ భావించారు. అయితే ఇప్పుడు తాజా సమాచారం ప్రకారం, అభిమానుల ఉత్కంఠను మరింత పెంచేలా మేకర్స్ ఒక రోజు ముందుగానే గ్లింప్స్‌ను రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారట. అంటే మే 19 అర్ధరాత్రి 12 గంటలకే ఈ ఫస్ట్ గ్లింప్స్ విడుదల కానున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. అర్ధరాత్రి నుంచే సోషల్ మీడియాలో తారక్ ఫ్యాన్స్ సంబరాలు మొదలయ్యే అవకాశముంది. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన చిన్న చిన్న లీక్స్, సెట్స్ ఫోటోలు అభిమానుల్లో భారీ హైప్ తీసుకొచ్చాయి. ఇప్పుడు ఫస్ట్ గ్లింప్స్‌తో ప్రశాంత్ నీల్ సృష్టించిన కొత్త ప్రపంచం ఎలా ఉండబోతుందో చూడాలని సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు మే 18న రామ్ చరణ్ నటిస్తున్న 'పెద్ది' ట్రైలర్ విడుదల కానుండటంతో సోషల్ మీడియాలో ఇప్పటికే మెగా అభిమానుల హంగామా మొదలైంది. ఇక దానికి మరుసటి రోజే తారక్ గ్లింప్స్ రావడంతో మెగా-నందమూరి అభిమానుల మధ్య సోషల్ మీడియా వార్ పీక్స్‌కు చేరుతుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ భారీ ప్రాజెక్ట్‌ను ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమాను 2027 జూన్ 11న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. తారక్ నుంచి వస్తున్న ఈ భారీ సోలో ప్రాజెక్ట్ కావడంతో ప్రతి అప్డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇక మే 19 అర్ధరాత్రి విడుదలయ్యే గ్లింప్స్‌లో తారక్ లుక్, క్యారెక్టర్, సినిమా బ్యాక్‌డ్రాప్‌పై క్లారిటీ వచ్చే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు.

# వరుస ఫ్లాపులతో ముందు జాగ్రత్త

## రెమ్యూనరేషన్ భారీగా తగ్గించుకున్న రవితేజ



**టాకీస్:** మాస్ మహారాజా రవితేజ గత కొంతకాలంగా బాక్సాఫీస్ వద్ద సరైన విజయాన్ని అందుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకప్పుడు వరుస హిట్లతో టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక మార్కెట్‌ను సృష్టించుకున్న రవితేజ, ఇప్పుడు వరుస పరాజయాలతో కెరీర్‌లో వైఫల్య దశను ఎదుర్కొంటున్నారు. ఇటీవల విడుదలైన సినిమాలు ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో ఆకట్టుకోకపోవడంతో, ఆయన తన తదుపరి ప్రాజెక్టుల విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇప్పటివరకు కమర్షియల్ ఎంటర్‌టైనర్స్‌తో ప్రేక్షకులను అలరించిన రవితేజ, ఇప్పుడు మార్కెట్ పరిస్థితులను బట్టి తన నిర్ణయాల్లో మార్పులు చేస్తున్నారని తెలుస్తోంది. ముఖ్యంగా రెమ్యూనరేషన్ విషయంలో ఆయన తీసుకున్న తాజా నిర్ణయం చిత్రసీమలో హాట్ టాపిక్‌గా మారింది. ఒకప్పుడు సినిమా కోసం రూ.25 కోట్ల వరకు పారితోషి కం తీసుకున్న రవితేజ, ప్రస్తుతం తన రెమ్యూనరేషన్‌ను రూ.15 కోట్లకు తగ్గించుకు న్నారని ప్రచారం. నిర్మాతలపై అదనపు భారం పడకుండా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నారని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. వరుస డిజాస్టర్ల తర్వాత మార్కెట్‌లో తన స్థాయిని మళ్లీ నిలబెట్టు కోవాలంటే ముందుగా మంచి విజయాన్ని అందుకోవాల్సిన అవసరం ఉందని రవితేజ భావిస్తున్నారట. అందుకే ప్రస్తుతం కథల ఎంపికలో కూడా ఆయన చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ప్రస్తుతం రవితేజ నటిస్తున్న తాజా చిత్రం 'ఇరుముడి' పై ఇండస్ట్రీలో మంచి ఆసక్తి నెలకొంది. దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ఈ సినిమా రవితేజ కెరీర్‌లో పూర్తిగా భిన్నమైన ప్రయత్నంగా చెబుతున్నారు. ఇప్పటి వరకు ఎక్కువగా మాస్, కామెడీ, యాక్షన్ ఎంటర్‌టైనర్స్ చేసిన రవితేజ, ఈసారి థ్రిల్లర్ జానర్‌ను ఎంచుకోవడం అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. 'ఇరుము డి' సినిమా కథ, ట్రీట్‌మెంట్, రవితేజ పాత్ర పూర్తిగా కొత్తగా ఉండబోతున్నా యని సమాచారం. ఈ సినిమా విజయమే ఇప్పుడు ఆయన కెరీర్‌కు చాలా కీలకంగా మారింది. ఒకవేళ ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సా ధిస్తే రవితేజ మళ్లీ ఫామ్‌లోకి రావడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.